# ఆకాశయుద్ధం

## శ్యాంబాబు

ఆదొక ఎయిర్ కండిషన్డ్ హాలు. పాకిస్తాన్ కంబైన్డ్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ కాన్ఫరెన్స్ హాలు.

ఎయిర్ కండిషన్ చేయడంవలన గదిలో చల్లగా, ప్రశాంతంగా వుంది. సౌండ్ ప్రూఫ్ కావడంవలన గదిలో మాటలు బయటకు వినపడే అవకాశం లేదు.

పదడుగుల బల్ల చుట్టూ స్ట్రెయిట్ బాక్స్ చెయిర్స్‌లో పది మంది వ్యక్తులు కూర్చొని వున్నారు. అందరి ముఖాల్లో తీవ్రత, గంభీరత కనిపిస్తున్నాయి.

ఆ పది మందిలో ముగ్గురు పాకిస్తాన్ ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ దళాల అధిపతులు. మరో వ్యక్తి మాత్రం పాకిస్తానీయుడు కాదని చూస్తేనే తెలుస్తోంది. అందంగా

క త్తిరించిన లేత నీలంరంగు ఆక్స్ఫర్డ్ సూట్‌లో వున్నా డతను. నోట్లో ఇంకా వెలిగించని పైపు అటూ ఇటూ కదుల్తోంది.

పాకిస్తాన్ డిఫెన్స్ సెక్రటరీ గొంతు సవరించుకొని ఓ సారి అందరివంకా చూశాడు. అందరి కళ్ళూ అతని మీదే వున్నాయి.

"వెల్ జంటిల్‌మన్! ఈ రోజు ఓ చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకోవడంకోసం మనం ఇక్కడ సమావేశం అయ్యాం. పందొమ్మిదివందల డెభ్భైఒకటిలో తూర్పు పాకిస్తాన్ని మన దేశంనుండి విడగొట్టి బంగ్లాదేశ్‌గా ఏర్పాటుచేసి అంతర్జాతీయంగా మనల్ని అప్రతిష్ట పాలు చేసింది భారతదేశం. ఆ అవమానాన్ని తిప్పికొట్టే స్థితికి మనం ఈ రోజు చేరుకొన్నాం. అంచేతే తూర్పు పాకిస్తాన్‌ని విడగొట్టి, బంగ్లాదేశ్‌ను వాళ్ళు స్థాపించినట్లే, కాశ్మీర్ రాష్ట్రాన్ని భారతదేశాన్నుండి విడగొట్టి స్వతంత్ర కాశ్మీర్‌ను నెలకొల్పాలనే నిర్ణయాన్ని పాకిస్తాన్ మంత్రి వర్గం నిన్నే ఆమోదించింది.

కాశ్మీర్‌ను భారతదేశంనుండి విడగొట్టి మనకు అనుకూలమైన స్వతంత్ర దేశంగా చెయ్యటంవలన మనకు కలిగే లాభాన్ని నేను మీకు వేరే చెప్పనక్కరలేదు. మొట్టమొదటి లాభం మన దేశంయొక్క కీర్తిప్రతిష్ఠలు ఆకాశాన్నంటుతాయి. సౌత్ వెస్ట్ ఏసియాలోనూ, ఆసియా మైనర్లోనూ పాకిస్తాన్ ఒక అగ్రరాజ్యం అవుతుంది. చైనాతో మనకు సంబంధాలు చాలా దగ్గరవుతాయి. భారతీయులకు రష్యాతో సరిహద్దు పోవడంవలన, క్రొత్తగా ఏర్పడిన మన సెటిలైట్ దేశం వాళ్ళకు ఎయిర్ రూట్

పర్మిషన్ ఇవ్వకపోవడంవలన, రష్యాతో అనేక వ్యాపార, సైనిక సంబంధాలున్న భారతదేశం విపరీతంగా నష్ట పోతుంది. ఈ విషయాలన్నీ దృష్టిలో పెట్టుకొని పాకిస్తాన్ భారతదేశంపై యుద్ధం ప్రకటించడానికి నిర్ణయం తీసుకొంది..." అగాడు డిఫెన్స్ సెక్రటరీ.

"ది హెల్ విత్ ఇట్! భారతీయులు ఏమీ చేయకుండా వాళ్ళమీద మనం యుద్ధం ప్రకటించడం అసంభవం. అలాంటిది జరిగితే ప్రపంచ దేశాల దృష్టిలో తప్పు మన దవుతుంది." అన్నాడు ఎయిర్ చీఫ్ మార్షల్ సిగరెట్ వెలిగిస్తూ.

"యస్. యస్. యు ఆర్ రైట్ మార్షల్. అలాంటిది జరగకుండా భారతీయుల ఊహాబుద్ధివలననే మనం యుద్ధం ప్రకటించామని ప్రపంచానికి నచ్చచెప్పేందుకు సరైన మార్గం మన అమెరికన్ ఫ్రెండ్ ఆలోచించిపెట్టారు."

అందరి కళ్ళూ ఆక్స్‌ఫర్డ్ సూట్‌వాలావైపు తిరిగాయి.

"ఇటీజ్ సింపిల్. రెండవ ప్రపంచ యుద్ధం హిట్లర్ ఎలా మొదలుపెట్టాడో మీకు తెలిసేవుంటుంది. జర్మనీతో ఏ శత్రుత్వం లేకుండా, శాంతియుతంగా వున్న పోలెండ్ పై రాత్రికి రాత్రి తన సైన్యాన్ని హిట్లర్ నడిపించడంతో రెండవ ప్రపంచ యుద్ధం మొదలయింది. పోలెండ్ మీదకు దండెత్తడానికి హిట్లర్ చూపిన కారణమేమిటి? తను దాడి చెయ్యదలచుకొన్న రాత్రి సరిహద్దులో వున్న ఓ మారుమూల స్థావరంపై పోలెండ్ సైనికులు దాడిచేసి జర్మను సైనికులను చంపినట్లు సాక్ష్యం సృష్టించాడు. అదే పద్ధతి మనం అనుసరించడంలో తప్పులేదను కొంటాను." అన్నాడతను నవ్వుతూ.

"యు మీన్?" అన్నాడు నేవీ చీఫ్ ఆశ్చర్యంగా.

"నో. నాట్ క్వయిట్ ది సేమ్ మెథడ్. మన దళాలు సరిహద్దు దాటడానికి ఏదో ఒక అవకాశం కావాలి. అది ప్రపంచ ప్రజలు ఖండించేదిగా వుండకూడదు. అంచేత మనం ఓ క్రొత్త సీసాలో పాత సారాను పోసి చూపించాలి. మనం దాడిచెయ్యదలచుకొన్న రోజున...నిర్ణయించుకొన్న సమయానికి శ్రీనగర్‌లోనూ, జమ్మూలోనూ మన ఏజంట్లు కొంతమంది పాకిస్తానును అభిమానించే స్థానిక కాశ్మీరీయుల సహాయంతో రేడియో కేంద్రాలను వశపర్చుకొంటారు. అలా వశపర్చుకొన్న వెంటనే కాశ్మీర్ విముక్తి దళంవారు ప్రభుత్వాన్ని స్వాధీనం చేసుకొన్నారనీ, భారత ప్రభుత్వంనుండి వచ్చే ప్రమాదంనుండి రక్షణగా ప్రపంచ రాజ్యాలు సహాయం చెయ్యాలనీ కోరతారు. వెంటనే పాకిస్తాన్ సైన్యాలు సరిహద్దులు దాటి కాశ్మీర్‌లో ప్రవేశించి, కాశ్మీర్‌కు, మిగతా దేశానికి మధ్య వుండే రహదారుల్ని, ఇతర కమ్యూనికేషన్లను స్వాధీనం చేసుకొంటాయి" అన్నాడు ఆక్స్‌ఫర్డ్ నూట్‌లో అమెరికన్.

"ఇదంతా జరుగుతోంటే పంజాబునుండి, కాశ్మీర్ పై వరకూ వున్న పదిహేను ఎయిర్‌ఫోర్స్ బేసిస్, బోర్డర్ వెంట వున్న జవాన్లు చూస్తూ వుంటారనుకొంటాను." అన్నాడు ఎయిర్ మార్షల్ వెక్కిరింతగా.

"నో. కాశ్మీర్‌ను ఆక్రమిస్తోంటే భారత సేనలు, విమానదళాలు చూస్తూ వూరుకోవు. తప్పనిసరిగా యుద్ధానికి దిగుతాయి. కాని భారత సైనికదళాలు తేరుకొని మనల్ని ఎదిరించి యుద్ధానికి దిగకముందే మనం కాశ్మీర్‌తో

మిగతా దేశానికున్న సంబంధాలు తెగ్గొట్టి శ్రీనగర్‌ను ఆక్రమించుకోవాలి.'' అన్నాడు డిఫెన్స్ సెక్రటరి.

''శ్రీనగర్‌ను ఆక్రమించుకొన్నామనే అనుకొందాం. కాని ఇతర దేశాల సహాయం లేకుండా మనం కాశ్మీర్‌ను ఏదో ఒక ఒప్పందానికి వచ్చేవరకూ ఆక్రమించి వుండ లేమనుకొంటాను. ఎందుకంటే కాశ్మీర్, బంగ్లాదేశ్ లాగా అసలు దేశంనుండి దూరంగా విడిపోయివున్న ప్రదేశం కాదు. అంచేత తాత్కాలికంగా భారత సేనల్ని సర్‌ప్రయిజ్ చేసి మనం కాశ్మీర్‌ను ఆక్రమించినా, భారత దేశం యుద్ధం కొనసాగిస్తే ఓ నెల రోజులకన్నా మనం ఎక్కువ కాలం యుద్ధం చెయ్యలేమనుకొంటాను'' అన్నాడు ఆర్మీ జనరల్ సూటిగా డిఫెన్స్ సెక్రటరీవంకే చూస్తూ.

అమెరికన్ పరిహాసంగా నవ్వాడు, ''జనరల్! నీ సోల్జర్ శక్తిసామర్థ్యాలమీద నీకే నమ్మకం లేదా?'' అన్నాడు.

జనరల్ అమెరికన్ వైపు తీక్షణంగా చూశాడు. ''నా సైనికులు ప్రపంచంలో ఏ దేశం సైనికులకీ శక్తిసామర్థ్యాలలో తీసిపోరు. కాని యుద్ధనిర్వహణయొక్క ప్రాథమిక సూత్రాలు ఎవ్వరూ మరిచిపోయి యుద్ధానికి దిగకూడదు.''

''వాట్ డు యు మీన్?'' అమెరికన్ ముఖంలో రంగులు మారాయి. గదిలో క్షణంలో టెన్షన్ పెరిగింది.

''వాట్ ఐ ఎగ్జాక్ట్లీ మీన్ యీజ్ దిస్. పాక్ సైనికులు ఎంత ధైర్యసాహసాలు గలవాళ్ళయినా, పారిశ్రామికంగా, సాంకేతికంగా అభివృద్ధి చెందిన ఇండియాతో నెల రోజులకన్నా ఎక్కువ కాలం నిలదొక్కుకొని

యుద్ధం చెయ్యలేరు. దానికి మొదటి కారణం ఆయుధాలు, మందుగుండు సామగ్రి. ఇంతవరకూ పాకిస్తాన్ తన సైనికులకు కావలసిన ఆయుధాలు, మందుగుండు ఇతర దేశాల్నుండి తెప్పించుకోవడం తప్ప, తను తయారుచేసుకోనే ప్రయత్నం చెయ్యలేదు. అలాంటప్పుడు యుద్ధకాలం పెరిగితే ఆయుధాలు, ఇతర సామగ్రి అగకుండా యుద్ధప్రదేశానికి వచ్చే అవకాశం లేదు. ఒకసారి నిల్వ చేసుకొన్న ఆయుధాలు, మందుగుండు, ఇతర సప్లయిలు ఖర్చయిపోతే, సైనికులు ఎంత ధైర్యసాహసాల్తో వున్నా ఏం తిని యుద్ధం చేస్తారు? ఏ ఆయుధాల్తో యుద్ధం చేస్తారు?

అది మొదటి కారణం. ఇక రెండవది. కాశ్మీరును మనం ఆక్రమించుకొన్నంత మాత్రాన, మిగతా సరిహద్దంతా యుద్ధం లేకుండా వుంటుందా? భారతదేశానికి ఆ సమస్య లేదు. వాళ్ళు ఆయుధాలకోసం విదేశాలమీద ఆధారపడక్కర లేదు. యుద్ధం అన్న మరుక్షణాన వాళ్ళ దేశంలో ఫ్యాక్టరీలు వందలకొలదీ విమానాలు, టాంకులు ఉత్పత్తి చేస్తాయి. వాళ్ళ ఆయుధ కర్మాగారాలు ఎడతెరపిలేకుండా సరిహద్దులకు ఆయుధాలు సరఫరా చేస్తాయి. పైగా మరో విషయం. మామూలు యుద్ధంలో జయం పొందే అవకాశం లేకపోతే, వాళ్ళు అణు అస్త్ర పాటవాన్ని మన మీదకు పరీక్ష పెట్టరని గ్యారంటీ ఏమిటి?"

"మిస్టర్ జనరల్! అసంభవమయిన విషయాలు మాట్లాడుతున్నారు." అన్నాడు ఓ డిఫెన్స్ మినిస్టరీ అధికారి.

"నో. ప్రాక్టికల్‌గా ఆలోచించి చెపుతున్నాను. వారం...కాదు పది రోజులపాటు భారతదేశం ఎంత శక్తివంతమయినా సరే మేము ఎదిరించి నిలబడగలం. అందులో ఏమీ సందేహం లేదు. కాని తర్వాత మనకున్న వనరుల్లో యుద్ధాన్ని విజయవంతంగా కొనసాగించడం అసంభవం" అన్నాడు జనరల్.

"ఐ అప్రిషియేట్ యువర్ ఫీలింగ్స్ జనరల్! కాని మీరు పది రోజులు కూడా యుద్ధం చెయ్యవలసిన అవసరం వుండదనుకొంటాను. మీరు సరిహద్దు దాటి వెళ్ళి ఎప్పుడయితే కాశ్మీరును, మిగతా దేశాన్ని కలిపే రహదారుల్ని, రైలుమార్గాల్ని స్వాధీనం చేసుకొంటారో, ఆ క్షణానికి ఐక్యరాజ్య సమితి ద్వారా యుద్ధవిరమణ ప్రతిపాదన అమలులోకి వచ్చేటట్లు చేస్తాను. అంటే యుద్ధం ఎక్కడిదక్కడ ఆగిపోతుంది. మనం స్వాధీనం చేసుకొన్న ప్రాంతమంతా మన చేతుల్లో వుంటుంది. అంటే కాశ్మీరు మన చేతుల్లో వుంటుందన్నమాట.ఆ తర్వాత అంతర్జాతీయ స్థాయి చర్చల్లో ఈ వివాదం తేలేప్పటికి ఏమవుతుందో మనం ఊహించుకోవచ్చు. అలాగా కాశ్మీరును మనం ఒక స్వతంత్ర రాజ్యంగా రూపొందించవచ్చు." అన్నాడు డిఫెన్స్ సెక్రటరీ.

"ఆర్ యు ష్యూర్ సర్?" అన్నాడు నేవీ అడ్మిరల్.

అమెరికన్ నవ్వాడు. "సినాయ్ డిజర్ట్‌లో నుండి ఈజిప్షియన్లను తరిమేసి ఇజ్రాయెల్ పందొమ్మిదివందల అరవైయేడులో ఆక్రమించుకొంది. ఈనాటివరకూ ఆ విషయం ఏమీ తేలలేదు అని మీకు తెలుసు. అదలా

వుండగా, ఈరోజు సినాయ్‌లో తను పోగొట్టుకొన్న భూభాగం గురించి యుద్ధం మానేసి సూయెజ్ కాలువ మీద తనకున్న హక్కు గురించి శాంతి చర్చలు జరుపుతోంది ఈజిప్టు. మీరు మీకిచ్చిన కార్యాన్ని నెరవేరుస్తే కాశ్మీరు విషయం అంతే అవుతుందని మీకు వేరే చెప్పనక్కరలేదనుకొంటాను" అన్నాడు.

ముగ్గురు అధికారులూ మౌనంగా వుండిపోయారు.

"సో. జంటిల్‌మన్. డోంట్ వర్రీ. రాజకీయ, అంతర్జాతీయ కారణాల గురించి, ఫలితాల గురించి మీరు ఆలోచించాల్సిన పని లేదు. మీకిచ్చిన సమయంలో, మీపని మీరు విజయవంతంగా నిర్వహించండి. మిగిలిన కార్యాలు పూర్తిచేసేపని మామీద వదిలిపెట్టండి. మరొక విషయం. దాడిచేసే రోజువరకూ మన ఉద్దేశ్యాలు శత్రుపక్షం గ్రహించే అవకాశం ఇవ్వకూడదు మీరు. అలా చేస్తే శత్రువుని హెచ్చరించినవాళ్ళమవుతాము. అంటే దాడి చేసే రోజువరకూ సరిహద్దుల్లో మన సేనల ఉనికి తెలియకూడదు. వీలయినంత లోపలికి వుండి 'డి. డే' (D. Day)న హఠాత్తుగా వాళ్ళమీద పడాలి. ఈ యుద్ధానికి సర్‌ప్రయిజ్ ఒకటే కాదు మన ఆయుధం. సీక్రెసీ కూడాను." అన్నాడు డిఫెన్స్ సెక్రటరీ లేచి నిలబడుతూ.

* * *

"సర్‌ప్రయిజ్ అండ్ సీక్రెసీ. డామిట్. చాలా జాగ్రత్తగా ఆలోచించాలి మనం" అన్నాడు గోడమీద సరిహద్దు 'బ్లో అప్' మేప్ వంకే తీక్షణంగా చూస్తూ పాకిస్తాన్ ఆర్మీ చీఫ్.

"యస్. 'ఆపరేషన్ యస్. యస్.' అని అందుకనేగా

మనం ఈ పథకానికి పేరు పెట్టింది'' అన్నాడు ఎయిర్ చీఫ్ సిగరెట్ కాలుస్తూ.

జాయింట్ ఫోర్సెస్ స్ట్రాటజీ మీటింగ్ అది. నేవీ చీఫ్ తాపీగా పైప్ కాల్చుకొంటూ కూర్చున్నాడు. ఈ యుద్ధంలో తన పాత్ర చాలా తక్కువని అతనికి తెలుసు. తన నౌకాదళం యుద్ధం సాగితే కోస్టల్ డిఫెన్స్‌కు మాత్రమే ఉపయోగిస్తుందని అతను మరిచిపోలేదు.

''హియర్ ఇటీజ్!'' అన్నాడు ఆర్మీ చీఫ్ సరిహద్దు మేప్‌లో ఓ ప్రాంతం చుట్టూ ఎర్రటి పెన్సిల్‌తో గుండ్రంగా గీత గీస్తూ.

గదిలో మిగిలిన వ్యక్తులందరూ ఆ ప్రాంతాన్ని జాగ్రత్తగా పరిశీలించడం మొదలుపెట్టారు. పాకిస్తాన్‌లోని సియాల్‌కోట్ ప్రాంతం, భారతదేశంలోని పంజాబు, హిమాచల్ ప్రదేశ్, కాశ్మీర్ రాష్ట్రాల సరిహద్దులు కలిసే ప్రాంతం అది. పంజాబు, కాశ్మీరు రాష్ట్రాల మధ్య సన్నని కోడిమెడలా వున్న పాక్ ప్రాంతం అది. సాధారణంగా 'చికెన్స్ నెక్' అని పిలుస్తారు ఆ ప్రాంతాన్ని.

''ఈ చికెన్స్ నెక్ ప్రాంతంలో రావీ నది భారతదేశంలోనుండి పాకిస్తాన్‌లోకి ప్రవహిస్తోంది. ఈ నది హిమాచల్ ప్రదేశ్‌లో చంబా ప్రాంతంలో పుట్టి కాశ్మీరు, పంజాబు సరిహద్దుగుండా ప్రవహించి, చికెన్స్ నెక్ ప్రాంతంలో అంతర్జాతీయ సరిహద్దు దాటి మన దేశంలో ప్రవేశిస్తుంది. దీనివల్ల ఒక విషయం మీకు స్పష్టంగా తెలుస్తూవుండాలి. రావీ నది పంజాబుకు, కాశ్మీరుకు మధ్య సరిహద్దులా వుంటుందన్నమాట. అంటే పంజాబునుండి ఈ నదికి అడ్డంగా కాశ్మీరులోకి వెళ్ళడానికి వేసిన వంతె

నలు, రహదారులు మనం స్వాధీనం చేసుకోగలిగితే, కాశ్మీరును మనం మిగతా దేశంనుండి విడగొట్టినట్టే లెక్క. ఎందుకంటే హిమాచల్ ప్రదేశ్ లోనుండి కాశ్మీరును, మిగతా దేశాన్ని కలుపుతూ రహదార్లు లేవు. ఉన్న రహదార్లన్నీ పంజాబుమీదగా రావీమీద వంతెనల ద్వారా కలపబడుతూ వున్నాయి."

"గో ఎహెడ్ జనరల్!" అన్నాడు ఎయిర్ మార్షల్.

"అందుచేత డి. దే నాడు ఆర్మీ సరిహద్దు దాటి తిన్నగా ఆ వంతెనలను స్వాధీనం చేసుకోవాలి. రావీ నది మీద సరిహద్దుకు వంద మైళ్ళ లోపున మూడు రహదారి వంతెన లున్నాయి. ఈ మూడిటినీ సైన్యం స్వాధీనం చేసుకోవాలి."

"యస్. డబుల్ నంబర్స్‌తో ఒక్క రాత్రిలో మనం ఆ పని పూర్తిచెయ్యొచ్చు." అన్నాడు ఓ పాక్ ఆర్మీ ఆఫీసరు. డబుల్ నంబర్స్ అంటే శత్రుపక్షానికన్న రెట్టింపు బలగం అన్నమాట.

"గుడ్. అదే సమయంలో మనవాళ్ళు సరిహద్దు అంతటా డిఫెన్స్‌కు సిద్ధపడతారు. చికెన్స్ నెక్ లో మాత్రం పూర్తి అఫెన్స్‌తో, ఫుల్ ఫోర్స్‌తో ముందు కెళ్ళాలి మనం. ఈలోగా మన ఎయిర్ ఫోర్స్ పంజాబు, కాశ్మీరు సరిహద్దుల్లో వుండే ఎయిర్ బేసస్ మీద హఠాత్ దాడి చేస్తుంది. అందుచేత ఇండియన్ ఎయిర్ ఫోర్స్ గ్రౌండ్ ఆర్మీ సమయానికి వచ్చే అవకాశం వుండదు. సో. జంటిల్ మన్. దిసీజ్ ది జనరల్ ప్లాన్" అన్నాడు ఆర్మీ జనరల్.

"కాని మరో సమస్య ఆలోచించలేదు మనం. హఠాత్తుగా డబుల్ నంబర్స్‌తో దాడి జరపాలంటే కనీసం

డి. డేకు ముందురోజుకయినా మన సైన్యాన్ని సరిహద్దుకి తరలించాలి. అలాంటప్పుడు ఈ సైనిక సంచలనం విషయం భారతీయులకు తెలియకుండా వుండడం అసంభవం" అన్నాడు ఎయిర్ మార్షల్.

"యస్. అందుకే మన డి. డే నవంబరు చివరిలో, డిసెంబరు మొదటి వారానికో పెట్టాలి. అప్పుడయితే రాత్రిళ్ళు పొగమంచు దట్టంగా వుంటుంది. సాయంత్రం ఏడు గంటలనుండి ఉదయం తొమ్మిదివరకూ పొగమంచు వుంటుంది. అంచేత సరిహద్దుకు వంద మైళ్ళ వెనకనుండి పది గంటల ప్రాంతంలో బయలుదేరినా తెల్లవారుజాము రెండు గంటలకల్లా సరిహద్దుకు చేరగలం" అన్నాడు చీఫ్.

"కాని వంద మైళ్ళ వెనకనుండి రాత్రికి రాత్రి మనం వచ్చి దాడిచేస్తే మన టాంకులకు, ఆర్మ్‌డ్ కార్లకు, ఇతర వాహనాలకు కావలసిన ఇంధనం మనకు ఇండియాలోకి ప్రవేశించేవరకే సరిపోతుంది. రిప్లేస్‌మెంట్స్, రిఎన్‌ఫోర్స్‌మెంట్స్ మనతో సరిహద్దుకు తెచ్చుకోవడం కష్టమయిన పని. మన సప్లయిస్ వింగ్ ఎంత ఎఫిషియంటయినా దాదాపు ఆరు డివిజన్ల ఆర్మ్‌డ్ మొబైల్ యూనిట్లు వేగంగా సాగిపోవడానికి కావలసినంత పెట్రోలు, ఇతర వస్తువులు సరఫరా చెయ్యలేదు" అన్నాడు నావల్ అడ్మిరల్.

"యస్. యు ఆర్ రైట్. అడ్మిరల్! అంచేతే మన కావలసిన సప్లయిస్ అన్నీ మనం సరిహద్దు దాటి ఇండియాలో ప్రవేశించేసరికి ఓ స్పెషల్ సప్లయిస్ ట్రెయిన్ ద్వారా మరో మార్గంలో రావాలి."

"ఆ ట్రైను సకాలంలో రాకపోతే??"

"వుయ్ హోప్ నాట్. డామిట్. ఇట్ మస్ట్ కమ్ సర్‌ప్రయిజ్, సీక్రెసీతో ఈ యుద్ధం విజయవంతం కావాలంటే ఆ సప్లయిస్ రైలు రైముకు మన దగ్గరకు చేరాల్సిందే. అలా చేరే ఏర్పాట్లన్నీ మనం చేయాలి" అన్నాడు చీఫ్ సమావేశాన్ని ముగిస్తూ.

## 2

డి. డే ఉదయం.

తెల్లవారుజాము నాలుగుగంటలయింది. ఢిల్లీలోని ఆర్మీ హెడ్‌క్వార్టర్స్. భారత దళాల ప్రధానాధికారి గోడ మీద వున్న భారత్-పాక్ సరిహద్దు పటాన్ని తీవ్రంగా చూస్తూ, అడ్జ్‌టెంట్ కమాండెంట్‌కు ఇన్‌స్ట్రక్షన్స్ డిక్టేట్ చేస్తున్నారు.

అదే సమయంలో ఎయిర్ చీఫ్ మార్షల్ గదిలోకి వచ్చారు.

"హౌ ఈజ్ ది పొజిషన్ జనరల్?" అడిగాడు ఎయిర్ మార్షల్.

"నాట్ బాడ్. రావీ నదికి రెండు ప్రక్కలా మూడు గంటలకు బోర్డర్ దాటారు పాకిస్తానీయులు. మన బి. యస్.యఫ్. స్టిఫ్ ఫైట్ ఇచ్చింది. ప్రయోజనం లేదు. నాలుగు ఆర్మర్డ్ డివిజన్స్, నాలుగు టాంక్ రెజిమెంట్లతో వచ్చారు వాళ్ళు. లేటెస్ట్ రిపోర్టులో సరిహద్దు దాటి పది మైళ్ళు లోపలకు వచ్చినట్లు చెపుతున్నాయి. మనవాళ్ళు వెనక్కి తగ్గి చందన్‌వారియా దగ్గిర రీగ్రూప్ అవుతున్నారు. ఉదయం ఏడింటికి మన రిఎన్‌ఫోర్స్‌మెంట్ దళాలు అక్కడికి చేరుకొంటాయి. అంతవరకూ ఆ బాస్టర్డ్స్‌ను ఆపడమే మన లక్ష్యం ప్రస్తుతం" అన్నాడు జనరల్.

"చందన్ వాలియా? బార్డరంతా ఫ్రంట్ ఓపెన్ అయినట్లు రిపోర్టులు చెపుతున్నాయి?"—

"నో మార్షల్. అదంతా ఐవాష్! బార్డరంతా మనల్ని ఎంగేజ్ చేసినట్లు నటించి కాశ్మీర్ను కట్ చెయ్యాలని వాళ్ళ ఎత్తు. చికెన్స్ నెక్ లో వాళ్ళ సైన్యంలో నాలుగో వంతు కాంసంట్రేట్ అయినట్లు రిపోర్టులు చెపుతున్నాయి. పంజాబ్ బార్డర్ లో వున్న రావీ బ్రిడ్జిలు మూడూ వశం చేసుకోవాలని వాళ్ళ ఎత్తు. చందన్ వాలియాకు పది మైళ్ళ వెనక వున్నాయి ఆ బ్రిడ్జిలు. అందుచేత మనవాళ్ళని రిగ్రూప్ అవమని చెప్పాను."

"ఐసీ. ఇన్ సెక్ట్స్!" అన్నాడు ఎయిర్ ఛీఫ్ కోపంగా

"మన ఫార్వర్డ్ బేస్ కండిషన్ ఎలా వుంది. లాండ్ అండ్ ఎయిర్ స్ట్రైక్స్ సింక్రనయిజ్ చేశారంటగా?"

"యస్. బాస్టర్డ్స్. మూడు గంటలకు మన ఎయిర్ బేసస్ అన్నిటిమీదా మెరుపుదాడి జరిపాయి పాక్ విమానాలు. బేడ్ లక్ ఫర్ దెమ్. పొగమంచుచాటున లాండ్ ఆర్మీ విజయవంతంగా దాడిచెయ్యవచ్చుగాని, విమాన దాడికి అది తగని శత్రువు. ఫూల్స్. పొగమంచులో మన బేసెస్ మీదికి దాడి చేయడం వలన, సూటిగా మన రన్ వేస్ని, హేంగర్స్ని నాశనం చెయ్యలేకపొయ్యారు. మన విమానాలన్నీ అండర్ గ్రౌండ్ హేంగర్స్లో వున్నాయి. అంచేత నో డామెజి. ఉదయం మంచుపడే సమయానికి మన విమానాలు పాక్ బేసులన్నిటినీ బంబార్డ్ చేసేస్తాయి. ఈలోగా వాళ్ళు రెండోసారి తిరిగివస్తే ఒక్క విమానం కూడా తిరిగి వెళ్ళదు. గ్రౌండ్ డిఫెన్స్ వాళ్ళంతా శామ్ (SAM) మిస్సైల్స్లో కాచుకొని వున్నారు" అన్నాడు యిర్ ఛీఫ్ ఉత్సాహంగా.

"గుడ్ వర్క్ మార్షల్! మీ ఎయిర్‌ఫోర్స్ సపోర్ట్ చాలా కావాలిప్పుడు. మొదటిది. చందన్‌వాలియాకు వాళ్ళ సైన్యాలు చేరుకోకముందే వాళ్ళను నాశనం చెయ్యాలి. లేదా మన అదనపు దళాలు చందన్‌వాలియా చేరేవరకూ పాక్ టాంకులు, ఆర్మ్‌డ్ డివిజన్స్ అక్కడకు చేరకుండా ఆపాలి.

"ఇక రెండవది. నాలుగు ఆర్మ్‌డ్ డివిజన్లు, టాంక్ రెజిమెంట్లతో రాత్రికి రాత్రి వాళ్ళు వచ్చారంటే బార్డర్ లోపల చాలా దూరంనుండి వచ్చి వుండాలి. లేకపోతే మనకి ముందే తెలిసివుండేది. అంచేత వాళ్ళు ముందుకు పోవడానికి అవసరమైన ఫ్యూయిల్ సప్లయిస్ వెనక వేరే వస్తాయి. అలావస్తేనే వాళ్ళ యుద్ధం కొనసాగించగలరు."

"ఐ అండర్‌స్టాండ్ జనరల్. వెంటనే మన విమానాల్ని పంపి ఆ సప్లయిస్ వచ్చే మార్గాన్ని, వీలయితే ఆ సప్లయిస్‌ను నాశనం చెయ్యాలి. రైట్! మా విమానదళం తగిన చర్యలు వెంటనే తీసుకొంటుంది" అన్నాడు మార్షల్ గంభీరంగా. అక్కడినుండే చకచకా విమాన దళాధిపతులకు ఆర్డర్సు పంపసాగాడు.

# 3

ఉదయం: నాలుగు నలభై అయిదు.

"ఫార్మేషన్ లైటినింగ్."

పఠాన్‌కోట్ ఎయిర్‌బేస్‌లో రెండు స్క్వాడ్రన్ల బాంబింగ్ విమానాలు, మరోస్క్వాడ్రన్ హంటర్ విమానాలు బయలుదేరడానికి సిద్ధంగా వున్నయ్.

బాంబింగ్ ఫార్మేషన్ ఎప్పుడూ ఫైటర్ ఇంటర్‌సెప్టర్ విమానాల ఎస్కార్టు లేకుండా బాంబింగ్ చెయ్య

డానికి వెళ్ళదు. ఎందుకంటే కొన్ని వందల టన్నుల బాంబులతో వెళ్లే బాంబర్సును మధ్యలో శత్రువిమానాలు అడ్డగిస్తే, ఫైటర్ ఇంటర్ సెప్టర్ జెట్స్ వాటిని ఎదుర్కొంటాయి. బాంబర్స్ తమ పని తాము పూర్తి చేస్తాయి.

స్క్వాడ్రన్ లీడర్ సునేజా, లీడింగు మారుతీలో వుండి స్క్వాడ్రన్ కమాండ్ చేస్తున్నాడు.ఒక్కొక్కటే నిముషం వ్యవధి చొప్పున వరుసగా పది మారుతీ విమానాలు ఆకాశంలోకి లేచాయి. వాటి వెనుకనే హంటర్స్ కూడా పైకి లేచాయి.

ఆకాశంలోకి లేచిన విమానాలు రెండు నిముషాల పాటు ఆకాశంలో తిరుగుతూ వుండిపోయాయి. స్క్వాడ్రన్ లీడర్ సునేజా ఫార్మేషన్ కమ్యూనికేషన్ లింక్ లో పిలిచాడు.

"ఫార్మేషన్ లైటినింగ్ నెంబర్ వన్ కాలింగ్, లైటినింగ్ నెంబర్ వన్ కాలింగ్. రిపోర్ట్ ఎవిరిబడీ!"

"టు రెడీ. త్రీ రెడీ." అంటూ అందరూ సమాధానం చెప్పారు.

"ఓ. కె. పార్మ యారో ఫార్మేషన్ నార్త్ వెస్ట్ 50 డిగ్రీస్" అన్నాడు సునేజా తాము చేరుకోవలసిన లొకేషన్ డైరెక్షన్ ఇస్తూ.

"కాలింగ్ లైటెనింగ్ లయన్స్," పిలిచాడు మళ్ళీ సునేజా. ఇది ఫైటర్ ఫార్మేషన్ కు ఇచ్చిన పేరు.

హంటర్ స్క్వాడ్రన్ నాయకుడు ఫ్లయిట్ లెఫ్టినెంట్ డిసాజా కంఠం అవతలినుండి వినిపించింది. "అల్ సెట్ లైటినింగ్. మీ ఇన్ స్ట్రక్షన్ విన్నాను. మీ ఫార్మేషన్ చుట్టూ మా లయన్స్ వున్నారు" అన్నాడు.

తలెత్తి చూశాడు సునేజా. తను నడుపుతున్న మారుతీ పైనే సరిగ్గా హంటర్ ఎగురుతోంది. నవ్వుకొన్నాడు.

అరగంటలో ఫార్మేషన్ లైటినింగ్ లోని మారుతీ బాంబింగ్ విమానాలు, హంటర్లు చందన్ వాలియా దరిదాపు ప్రాంతానికి వచ్చాయి.

స్క్వాడ్రన్ లీడర్ సునేజా కంఠం ఇంటర్ కమ్యూనికేషన్ లో ఖంగుమంది. "ఫార్మేషన్ లైటినింగ్. రీచింగ్ టార్గెట్ ఎబవుట్ టు మినిట్స్. అన్ లాక్ అండ్ మేక్ స్ప్రెడ్ ఫార్మేషన్, లయన్స్ బి రడీ ఎట్ వింగ్స్."

సునేజా కమాండ్ ప్రకారం మారుతీ బట్సన్నీ ఒకదాని ప్రక్కన ఒకటి స్ట్రెయిట్ లైన్లో ఎగరడం మొదలు పెట్టాయి. ఫార్మేషన్ కు రెండు ప్రక్కలా రెండు రెండు హంటర్స్ ఎగురుతున్నాయి.

పొగ మంచు నేలమీద మెల్లిగా విడిపోతోంది. దూరంగా నాలుగు మైళ్ళ దూరంలో పాకిస్తాన్ టాంకు దళాలు కనిపిస్తోన్నాయి. ఫార్మేషన్ భారత దళాల మీదుగా ఎగురుతూ వెళ్ళినప్పుడు భారత సైనికులు ఆనందోత్సాహంతో కేకలు వేశారు.

"ఫార్మేషన్ లైటెనింగ్. క్లయింబ్ టు ఫోర్ థౌజండ్" అన్నాడు సునేజా కంట్రోల్ స్టిక్ పైకిలాగి తన మారుతీను తిన్నగా ఇంకా ఎత్తుకు తీసుకెళుతూ.

మిగతా విమానాలన్నీ సునేజాతోపాటు నాలుగు వేల అడుగుల ఎత్తుకు లేచాయి. ఇప్పుడు సరిగ్గా ఫార్మేషన్ అంతా పాక్ దళాలు ఆక్రమించుకొన్న ప్రాంతంపైనుంది.

"లైటెనింగ్ లయన్స్. ఫస్ట్ యు గో. మేక్ స్పైరల్

బ్లాస్ట్ అండ్ పులప్. లైటెనింగ్ టూ, త్రీ అండ్ ఫోర్. రడీ టు స్ట్రైక్ ఆఫ్టర్ లయిన్స్ పులప్." సునేజా కంఠంలో ఎక్సయిట్ మెంట్ ధ్వనిస్తోంది.

సునేజా పథకం పైలట్సందరికీ అర్థమయింది. మొదట ఫైటర్ హంటర్సు, నాలుగువేల అడుగులనుండీ స్పిన్ అవుతూ అంటే గిర్రున తిరుగుతూ క్రిందకు దిగుతాయి' అలా దిగుతూనే మిషన్ గన్స్ పేల్చి, భూమికింకా యాభై అడుగుల ఎత్తు వుండగానే చటుక్కున ప్రక్కకు తిరిగి ఎత్తుకు లేచిపోతాయి.

ఇలా హఠాత్తుగా ఆకాశంలో నుండి జట్స్ మీద పడుతున్నట్లు అతివేగంగా క్రిందికి రావడంవలన శత్రువులో కంగారు, అలజడీ రేగుతాయి. ఆ కంగారువల్ల విమాన దాడినుండి సరైన రక్షణ తీసుకోడు. ఫైటర్ జట్స్ పైకి లేవగానే బాంబర్స్ ఒకదాని వెనక ఒకటి చకచకా క్రిందికి వచ్చి, టాంకుమీద బాంబులవర్షం కురిపిస్తాయి.

హంటర్స్ కమాండర్ డిసౌజా ఉత్సాహంగా ముందుకు వంగాడు. "ఓ.కె లీడర్" అని "లయిన్ టూ ఫాలో మీ. త్రీ అండ్ ఫోర్ కీప్ వాచ్." అన్నాడు కంట్రోలు స్టిక్ రివర్స్ కాలమ్కు తోస్తూ.

అంటే రెండు హంటర్స్ శత్రువులమీదకి వెళితే మిగిలిన రెండూ బాంబర్స్కు కాపలా వుంటాయన్నమాట.

ఆకాశంలో నుండి రెండు హంటర్సూ నాలుగువేల అడుగుల ఎత్తునుండి రయ్యిన రొదచేస్తూ బొంగరంలా గిర్రున తిరుగుతూ పాక్ సైనికులమీదకు దిగినయ్.

పాక్ సైనికుల్లో కల్లోలం ఊహించలేనిది. ఎక్కడి వాళ్ళక్కడ నేలకు కరుచుకొని బోర్లా పడుకొన్నారు.

హంటర్ ఫ్రంట్ మిషన్‌గన్స్‌లోని బుల్లెట్స్ నేలమీద సైనికులమీదా గుచ్చుకొంటూ దుమ్ము లేపుతున్నయ్.

డిసౌజా హంటర్స్ స్పిన్ అవుతూ క్రిందకు దిగగానే సునేజా మరో మూడు బాంబర్స్‌తో క్రిందకు దిగాడు. డిసౌజా భూమికి యాభై అడుగుల దగ్గరగా రాగానే హంటర్ని ప్రక్కకు తిప్పి గబగబా పైకెగిరిపోయాడు.

డిసౌజా పైకి ఎగరడం మొదలెట్టగానే సునేజా విమానాన్ని ఏటవాలుగా పాక్ టాంకుల దళంవైపు పోనిచ్చాడు. అతని వెనక మిగిలిన మూడు మారుతీలూ ఎగిరాయి.

విమానాన్ని ఏటవాలుగా క్రిందికి దించుతోనే వేగం పెంచాడు డిసౌజా. సరిగ్గా విమానం టాంకులమీదికి రాగానే స్పీడ్ కట్ చేసి, బాంబ్ రిలీజ్ లీవర్ లాగాడు. మారుతీ రెక్కల క్రిందున్న బయటి పాకెట్స్‌లోని యాభై కేజీల బాంబులు నాలుగూ క్రిందకు జారాయి.

బాంబులు పాకెట్‌లో నుండి క్రిందకు జారగానే, మళ్ళీ స్పీడు పెంచి విమానాన్ని ఎత్తుకు లేపాడు. విమానాన్ని అలా పైకి లేపుతూనే కంట్రోల్ స్టిక్ పైన నల్లగా వున్న ఫోటోస్విచ్ చకచక నొక్కాడు. ఆ స్విచ్ విమానం క్రిందవైపు కనెక్ట్ చెయ్యబడిన ఆటోమేటిక్ కెమెరా షట్టర్ రిలీజ్ చేస్తుంది—అంటే బేస్‌కు తిరిగివెళ్ళిం తరువాత, జారవిడిచిన బాంబులు ఎక్కడ ప్రేలాయో, శత్రువుల టాంకులు ఎలా విధ్వంసమయ్యాయో, ఆ ఫోటో నెగిటివ్ డెవలప్ చేసి తెలుసుకోవచ్చు.

సునేజా వదిలిన బాంబులు ప్రేలిన పది సెకండ్ల తరువాత లైటినింగ్ టు మారుతీ, బాంబులు శత్రుటాంకుల

మీద వదిలింది. అలా ముందు జెట్ వదిలిన బాంబులు ప్రేలిన పదిసెకండ్లకి తరువాత జెట్ బాంబ్ చేస్తూ, నాలుగు మారుతీలూ పైకిలేచాయి.

ఆకాశంలోకి రయ్యిన ఎగబ్రాకుతూ తమ శతృవుకి ఏ మాత్రం నష్టం కలిగింది చూసుకొన్నాడు సునేజా. బాంబులు పడిన ప్రాంతమంతా నల్లని దట్టమైన పొగతో, అగ్నిజ్వాలల్తో నిండిపోయి వుంది. దాదాపు అరడజను టాంకులు మండుతూ కనిపించాయి.

మిగిలిన పాక్ టాంకులు ఒక దాన్నుండి ఒకటి దూరంగా వెళ్ళిపోతున్నాయి. అలా టాంకులు ఒకేచోట వుండకుండా దూరదూరంగా విడిపోవడంవలన బాంబింగ్ చేయడం కష్టమవుతుంది.

"లైటెనింగ్, ఫైవ్, సిక్స్, సెవెన్ అండ్ ఎయిట్. మూవ్ ఎహెడ్ అండ్ బ్లాస్ట్" అరిచాడు సునేజా ఉత్సాహంగా ఇంటర్‌కమ్‌లో. "గుర్తుంచుకోండి. సింగిల్ టాంక్ బాంబ్ చేసేప్పుడు ఒక్కటే బాంబ్ రిలీజ్ చెయ్యండి."

సునేజా, మిగతా మూడు విమానాలు దూరంగా చాలా ఎత్తుకి ఎగిరాయి. విమానాలను చిన్నచిన్న సర్కిల్స్‌లో తిప్పుతూ, రెండవ బాచ్ మారుతిల బాంబింగ్ చూస్తున్నారు అందరూ.

లయన్స్ త్రి అండ్ ఫోర్. క్రేన్ చెక్కర్ పాట్రన్‌లో మిషన్‌గన్‌లు పేలుస్తూ పెద్ద రొదచేస్తూ అతివేగంగా పల్టీలుకొడుతూ పాక్ సైనికుల తలలకు తగిలేట్టు అనిపించే ఎత్తులో రెండుసార్లు తిరిగి పైకి వచ్చాయి. వెంటనే మిగిలిన నాలుగు మారుతీలు ఒకదాని వెనుక ఒకటే వరసనే క్రిందికి దిగుతూ బాంబులు విడువసాగాయి.

లైటెనింగ్ ఫైవ్ విడిచిన ఫిఫ్టీ కిలోబాంబ్ ఓ టాంకు నడినెత్తిన పడింది. బాంబు తగిలీతగలడంతో టాంకు ముక్కలయి నల్లని పొగలో మండిపోసాగింది.

"వెల్ డన్ లైటెనింగ్ ఫైవ్! కీపిటప్!"—అరిచాడు సునేజా.

పదినిముషాల్లో దాదాపు రెండు కిలోమీటర్ల విస్తీర్ణంలో వున్న పాకిస్తాన్ ఆర్మ్‌డ్ మొబైల్ యూనిట్, టాంకుల రిజిమెంటు అల్లకల్లోల మయిపోయి, చెల్లాచదురయ్యాయి.

మిగిలిన నాలుగు విమానాలూ బాంబింగ్ పూర్తి చేశాయి. అయితే బాంబింగ్ ఇంకా పూర్తవలేదు. ప్రతి విమానంలో ఇంకా రెండువందల కిలోల బరువున్న బాంబులు మిగిలి వున్నాయి.

పాక్ సైనికులు దూరంగా వున్న చెట్లకేసి పరిగెట్టడం స్పష్టంగా కనిపిస్తోంది. కొంతమంది ధైర్యం తెచ్చుకొని ఆకాశంలోకి మిషన్‌గన్స్ పేలుస్తున్నారు.

"వెల్ డన్ బాయ్స్! నా లెటజ్ మేక్ క్రాస్ ఎటాక్"—అన్నాడు సునేజా.

క్రాస్ ఎటాక్ ఆశ్చర్యంలోనుండి తేరుకొని ఎదురు నిలబడే శత్రుదళాన్ని తికమకలో పెట్టడానికి ఉపయోగిస్తారు. అంటే ఎదురుగాగాని, వెనకనుండిగాని ఓ విమానం వస్తే ప్రక్కనుండి మరో విమానం వస్తుంది. అలాంటప్పుడు యాంటి ఎయిర్‌క్రాఫ్ట్‌గన్‌తో సిద్ధంగా వున్న శత్రువు ఏ విమానాన్ని షూట్ చెయ్యాలో అర్థం గాని స్థితిలో పడిపోతాడు.

"నేను టు, త్రి అండ్ ఫోర్ నార్త్ వైపునుండి ఎటాక్

చేస్తాము. మిగతా వాళ్ళు ఈస్ట్ సైడ్ నుండి క్రాస్ చెయ్యండి'' అన్నాడు సునేజా.

అంటే నాలుగు విమానాలు తూర్పునుండి, మరో నాలుగు ఉత్తర దిక్కునుండి ఈసారి శత్రుదళాన్ని బాంబ్ చేస్తాయన్నమాట.

తూర్పునుంచి ఎటాక్ చేసేవాళ్ళు పొజిషన్‌లో వున్నామని చెప్పగానే, "హియర్ వుయ్ గో!" అన్నాడు సునేజా విమానాన్ని ఉత్తరం వైపునుండి శత్రుదళాల మీదకు ఉరికిస్తూ.

ఎస్కార్ట్‌గా వచ్చిన నాలుగు హంటర్లు పారిపోతున్న పాక్ సైనికులమీద మిషన్‌గన్ గుళ్ళు కురిపిస్తూ, గాలిలో పల్టీలు కొడుతూ ఎగరసాగినయ్.

ఒక్కసారి నాలుగు వైపులనుండి వచ్చిపడిన బాంబర్లను చూడగానే పాక్ సైనికుల్లో ధైర్యం సన్నగిల్లింది. టాంకులన్నీ వున్నచోటనే చిన్నచిన్న రౌండ్లలో గుండ్రంగా తిరగసాగినయ్. అలా చేయడంవలన బాంబర్‌లో వున్న పైలట్ గురిచూడ్డం కష్టమౌతుంది.

టాంకుల పైభాగాన్నుండి తమమీద ఎవరూ మిషన్ గన్స్ పేల్చడంలేదని గమనించగానే మనసులోనే నవ్వుకొన్నాడు సునేజా. వెంటనే నిర్ణయం తీసుకొన్నాడు.

"గో డౌన్ అండ్ స్వీప్ బాయ్స్!" అరిచాడు.

బాంబర్లన్నీ క్షణాలమీద చాలా క్రిందుగా అంటే భూమికి ఇరవైనుండి, పదిహేనడుగుల ఎత్తుకు దిగాయి. ఒక్కో బాంబరు తను లక్ష్యంగా పెట్టుకొన్న టాంకును ఈ ఎత్తులోనుండి సులభంగా, సూటిగా బాంబ్ చెయ్యడానికి వీలవుతుంది.

టాంకు మరో రెండు సెకన్లలో విమానం క్రిందికి వస్తుం దనగానే బాంబ్ పాకెట్స్ రిలీజ్ చేసి, చప్పున పైకి ఎగిరిపోతున్నారు. నిముషంలో ఎనిమిది పాకిస్తాన్ టాంకులు అగ్నిజ్వాలల్లో భస్మీపటలం అయ్యాయి.

"గుడ్ వర్క్ బాయ్స్! లెటజ్ మేక్ అనెదర్ రన్!" అరిచాడు సునేజా ఉత్సాహంగా.

ఎనిమిది మారుతీ విమానాలు జంయిన క్రిందకు దిగాయి. మరో ఏడు పాకిస్తానీ టి-54 టాంకులు ముక్కలు ముక్కలయ్యాయి.

మూడు నిముషాల్లో విమానాలన్నిటిలోనూ బాంబ్ రాక్స్ అన్నీ ఖాళీ అయ్యాయి. నలభై పాకిస్తానీ టాంకులు, లెక్క తెలియని సైనికులు, కొన్ని మిలిటరీ ట్రక్కులు, ఆర్మ్డ్ కార్లు నామరూపాల్లేకుండా పోయాయి.

నల్లని పొగ, ఎర్రని అగ్నిజ్వాలలు, గాయపడిన సైని కుల ఆర్తనాదాలు...చాలా భీభత్సంగా వుంది పరిస్థితి... ఆకాశంలోనుండి చూడ్డానికి.

"స్ప్లెండిడ్ జాబ్ లాడ్స్! రియల్లీ బ్యూటిఫుల్ హిట్టింగ్. మధ్యాహ్నంలోగా మరో సార్టీ వేస్తే పాకి స్తానీయులు మళ్ళీ మరో పదేళ్ళవరకూ యుద్ధం పేరెత్తరు. లెటజ్ గో బాక్." అన్నాడు సునేజా విమానాన్ని బేస్ వైపుకు మళ్ళిస్తూ.

మూడు స్క్వాడ్రన్లూ విజయగర్వంతో పఠాన్ కోట్ బేస్ వైపు ఎగిరిపోయాయి.

# 4

ఉదయం: అయిదు గంటలు.

"ఎయిర్ ఫోర్స్ ట్రాన్స్పోర్ట్."

"రాజు! కెన్ యూ సీ ఎనిథింగ్?" అన్నాడు ఫ్లయింగ్ ఆఫీసర్ కెప్టెన్ చౌదరి ఫ్లయిట్ కాబిన్ కిటికీలోనుండి క్రిందకు తొంగిచూస్తూ.

అంతా పొగమంచు. అక్కడక్కడా నీడల్లా మంచు మధ్యలోనుండి నీడల్లా కనిపిస్తోన్న చిన్నచిన్న కొండ గుట్టలు తప్ప క్రిందంతా కనుచూపుమేర గుర్తు తెలియని మరో ప్రపంచంలా వుంది.

"నో...చౌ...ఎక్కడా ఏమీ గుర్తు తెలియడం లేదు. మనవాళ్ళు అనుకొన్న సమయానికి పైకి ఫ్లేర్స్ షూట్ చేస్తే తప్ప మనం చందన్ వారియా ఫీల్డ్ ఏదో గుర్తుపట్టడం అసంభవం." అన్నాడు ఫ్లయిట్ లెఫ్టినెంట్ రాజు మరో కిటికీలోనుండి బయటికి చూస్తూ.

"ది బెటర్ డూ ఇట్. అనుకొన్న సమయానికి ఫ్లర్స వెలిగించి మనకు సిగ్నల్ ఇవ్వపోతే మెడికల్ సప్లయిస్, ఎక్స్ట్రా ఆర్మీ, అమ్యూనేషన్ మనం అందించలేకపోతే మనవాళ్ళు చందన్ వారియా దగ్గిర నిలద్రొక్కుకోవడం కష్టం." అన్నాడు చౌదరి టైమ్ చూసుకొంటూ.

అదో సి-112 ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ట్రాన్స్పోర్ట్ విమానం. వంద టన్నుల పైబడే బరువును సునాయాసంగా వెయ్యి మైళ్ళ పైచిలుకు దూరానికి నాన్ స్టాప్ గా మోసుకెళ్ళగలదు. రష్యన్ మేడ్ రవాణా విమానమది. నాలుగు టర్బో జెట్ ఇంజన్ల సహాయంతో నడుస్తుంది.

అంతా పొగమంచువలన నావిగేషనల్ ఫ్లయింగ్ చెయ్యాల్సి వస్తోంది.

చౌదరి స్పీడు రెండు వందలకు తగ్గించాడు. గణేష్ చెప్పిన ఏరియా చుట్టూ ఆకాశంలో గుండ్రంగా చక్కర్లు కొట్టసాగాడు.

"ఇదేనంటావా! ఏమీ కనిపించడంలేదు. ఫ్లేర్స్ వెలిగించనీ." అంటున్నాడు చౌదరి కిటికీల్లోంచి క్రిందకు చూస్తూ.

"నౌ లుక్! లెవెన్ ఓ క్లాక్ డైరెక్షన్." అరిచాడు రాజు.

చూశాడు చౌదరి. దూరంగా విమానానికి ఎడం ప్రక్కగా ఎర్రటి, పసుపుపచ్చటి ఫ్లేర్స్ ఆకాశంలో కనిపించాయి. చటుక్కున మూడు సెకన్లపాటు వెలిగి ఆరిపోతున్నాయి.

"థాంక్ గాడ్! రడీ ఫర్ ది డ్రాప్." అన్నాడు చౌదరి విమానాన్ని ఇంకాస్త క్రిందికి దింపి ఫ్లేర్స్ కనిపించిన దిక్కువైపు పోనిస్తూ.

రాజు కాబిన్ తలుపు తెరుచుకొని 'బే'లోకి నడిచాడు. (రవాణా విమానాల్లో ఫ్లయింగ్ కాబిన్‌కు, తోకకు మధ్య వుండే భాగాన్ని 'బే' అంటారు.) బేలో వున్న ఇద్దరు ఎయిర్‌ఫోర్స్ మనుషులు అప్పటికే పారాచూట్లకు కట్టబడి వున్న బంగీలను డిస్పాచ్ లైనుకు తగిలించి రడీగా వుంచారు.

రాజు తల వూపగానే జంప్‌డోర్ తెరిచాడు ఒకతను. రయ్యిన గాలి లోపలకు ప్రవేశించి ఒక్క క్షణం లోపలి మనుషుల్ని ఉక్కిరిబిక్కిరి చేసింది.

"రడీ నౌ!" అరిచాడు.

"హోల్డ్ మినిట్. ఇంకా క్రిందకు దించుతున్నాను. లేకపోతే పారాచూట్లు ఎగురుతూ శత్రువుల మధ్య పడే అవకాశం వుంది." కంట్రోల్స్‌తో కుస్తీ పడుతూ అరిచాడు చౌదరి.

క్షణక్షణానికి పొగమంచు దగ్గర పడుతున్నట్లు కని పిస్తోంది తెరిచిన తలుపులోంచి. వేలో అలారం బెల్ మ్రోగింది.

"త్రో!" అరిచాడు రాజు.

వెంటనే ఒక్కొక్క బంగీనే బయటికి చకచకా త్రొయ్యసాగారు. విమానంలోనుండి బయటపడిన బంగీలు ఒక్క క్షణం గాలిలో ఊగిసలాడి, పారాచూట్ విప్పుకోగానే స్టడీగా క్రిందకు దిగుతున్నాయి.

మళ్ళీ అలారం మ్రోగింది. "స్టాప్" అరిచాడు రాజు. వెంటనే బంగీలు తొయ్యడం ఆపారు.

చౌదరి విమానాన్ని పైకి లేపి గుండ్రంగా త్రిప్పాడు. బంగీలు పడవలసిన చోటు దాటిపోయింది విమానం. మళ్ళీ ఓ చుట్టు తిరిగి ఆ ప్రదేశంమీదకు రాగానే మళ్ళీ త్రొయ్యడం ప్రారంభించారు.

థడ్! థడ్! మని కాబిన్ మీద బయటవైపు చప్పుళ్ళు వినిపించాయి. క్షణం గుండె జల్లుమంది చౌదరికి. ఆ శబ్దా లకు అర్థమేమిటో అతనికి తెలుసు. ఎవరో యాంటి ఎయిర్ క్రాఫ్ట్ గన్ తో తమ విమానాన్ని షూట్ చేస్తు న్నారు. ఇంత తక్కువ స్పీడ్ లో, క్రిందుగా పోతున్న విమానాన్ని గురి చూసి పడగొట్టడం అతి తేలిక. అంటే శత్రువులు తమ విమానం ఉనికిని పసిగట్టారన్నమాట. అంటే భారత దళాలున్న ప్రాంతానికి ఎంతో దూరంలో వుండివుండరు వాళ్ళు.

హఠాత్తుగా పొగమంచు విడిపోవడం ప్రారంభించింది. క్రింద వున్న టాంకులు, సైనిక శకటాలు అస్పష్టంగా కనిపించసాగినయ్.

"జస్ట్ అవర్ బాడ్ లక్," అనుకొన్నాడు చౌదరి త్వరగా డ్రాపింగ్ పూర్తిచెయ్యమని హెచ్చరిస్తూ.

బేలో వున్న రాజు ఆ శబ్దాల కారణం పసిగట్టాడు. ఎ.ఎ.సి. బుల్లెట్ ఒకటి బేలో నేలనుండి వచ్చి కప్పును చీల్చుకొని అంగుళం వెడల్పు రంధ్రం చేసింది.

"హారియప్!" అన్నాడు రాజు తను కూడా బంగీలను క్రిందకు తోస్తూ.

విమానం హఠాత్తుగా ఓ ప్రక్కకు వంగింది. బేలో ముగ్గురూ ప్రక్కకు పడబోయి డిస్పాచ్ లైను గట్టిగా పట్టుకొన్నారు. ఇంకా నాలుగు బంగీలు వున్నాయి క్రిందకు తొయ్యాల్సినవి.

"అవి త్రోసేసి తలుపు వెయ్యండి." అన్నాడు రాజు కాబిన్ లోకి పరిగెడుతూ.

"వాట్ కేప్టెన్?" అన్నాడు కాబిన్ లో రెండో ఇంజన్ కంట్రోల్ కాలమ్ చేతిలోకి తీసుకొంటూ.

"లెఫ్ట్ సైడు లోపలివైపు ఇంజను అంటుకొంది. ఫైర్ ఎక్స్టింగ్ విషర్ లైను కట్ అయిపోయివుండాలి. ఆరడంలేదు." అన్నాడు చౌదరి పళ్ళబిగువున కంట్రోల్ స్టిక్ స్వాధీనంలో వుంచుతూ.

"డామిట్! డ్రాప్ ది ఇంజన్. లేకపోతే దాని ఫ్యూయల్ సప్లయ్ లైన్లు అంటుకొని అదీ ప్రేలిపోయే ప్రమాదం వుంది." అన్నాడు రాజు విమానం కంట్రోలుకు తెస్తూ.

చౌదరి ఇంజన్ లాక్ రివర్స్ చేసి, జెటిసన్ స్విచ్ రివర్స్ చేశాడు. కాలుతోన్న ఎడమప్రక్క ఇంజను రెక్కనుండి వదులై క్రిందకు జారిపోయింది.

"గుడ్ వర్క్ కెప్టెన్!" అరిచాడు రాజా.

ఎడమవైపు రెండు ఇంజన్లులేక బాలన్స్ తగ్గడంవలన విమానం కుడివైపుకు వంగిపోతోంది.

"స్టాప్ ది రైట్ ఇన్ ఇంజన్. కనీసం ప్రొపెల్లర్ వెయిట్ అయినా తగ్గుతుంది." అరిచాడు చౌదరి.

కుడివైపు లోపలి ఇంజన్ ఆఫ్ చేశాడు. విమానంమీద గుర్త్వవర్షం ఎక్కువయింది.

"కాప్టెన్! టెయిల్ పీస్ సగం పైగా వూడి పోయింది." కంగారుగా బేలోనుండి చెప్పాడు ఒకతను.

ఇంజను అంటుకొన్న హడావిడిలో విమానం డైరక్షను కంట్రోలు చెయ్యడం మర్చిపోవడంవలన, అది ఇంకా శత్రుప్రదేశంలోకి చొచ్చుకుపోసాగింది.

సంగతి గ్రహించిన వెంటనే కంట్రోల్స్ పైకి లాగి స్పీడు పెంచి రైట్ టర్న్ చేశాడు చౌదరి.

అప్పుడు చూశాడు గణేష్. కుడివైపు బయటి ఇంజను, రెక్క భగభగ మండుతున్నాయి. ఇన్ సైడ్ ఇంజను స్టార్ట్ చేసి, అవుట్ సైడ్ ఇంజను డ్రాప్ చెయ్యక తప్ప లేదు చౌదరికి. ఇంజను జారిపోయినా రెక్క మాత్రం మంట ఆరలేదు.

"ఏం చెయ్యాలిప్పుడు?" అన్నాడు గణేష్ భయంగా.

అందరి ముఖాల్లో ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది. అప్పటికి విమానం శత్రు భూభాగం దాటి భారత సేన లున్న ప్రాంతంమీదికి వచ్చింది.

"ఆ రెక్క మండుతుంటే తిరిగే బేస్‌కు వెళ్ళే అవ కాశం లేదు మనకి." చౌదరి అంటుండగానే కుడివైపు ఇన్ సైడ్ ఇంజను కూడా అంటుకొంది. విమానం శివ మెత్తినట్లు వూగిపోతోంది.

"నా ఇటీజ్ ఇంపాసిబుల్. క్రాష్ లాండింగుకు సిద్ధం కండి." అన్నాడు చౌదరి విమానాన్ని నోస్ డైవ్ చేస్తూ.

విమానం బాలన్సు తప్పి ఫ్యూయల్ టాంకులు అంటుకొని పేలిపోవడానికి ఎంతోసేపు పట్టదని తెలుసు చౌదరికి. అసలు ఇంతవరకూ పెట్రోలు టాంకులు అంటుకోకపోవడం నిజంగా అదృష్టం.

క్రింద...పచ్చని పంటపొలాలు కనిపిస్తోన్నాయి. నోస్ డైవ్ ఇంకా క్రిందికిచేసి ఒక్కసారిగా స్టిక్ పైకి లాగాడు. మూడు ఇంజన్లు పోయినా కంట్రోలు ఇంకా పనిచేయడం నిజంగా అద్భుతం. దాదాపు భూమికి సమానంగా తీసుకువచ్చి బ్రేక్సు గట్టిగా పట్టుకొని ఇంజను ఆఫ్ చేశాడు.

విమానంలోని నలుగురూ బయటికి దూకి కాస్త దూరం పరిగెత్తిన మరుక్షణం పెద్ద ప్రేలుడుతో విమానమంతా అగ్నిజ్వాలల్లో మండిపోయింది.

## 5

ఉదయం అయిదుగంటలు.

"ఫార్మేషన్ సిల్వర్"

అంబాలా ఎయిర్‌ఫోర్సు స్టేషన్ అండర్‌గ్రౌండ్ బ్రీఫింగ్ హాల్లో పన్నెండు మంది పైలట్ ఆఫీసర్లు కూర్చొని ఉన్నారు. అందరి ముఖాల్లో ఉత్సుకత, టెన్షన్ కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. స్క్వాడ్రన్ లీడర్ బిస్వాస్ లేచి గోడమీద తగిలించి వున్న మేప్ దగ్గరికి నడిచాడు.

అది సరిహద్దు అవతల పాకీస్తాన్ రైల్వేమాపు.పంజాబు, కాశ్మీర్‌లను అనుకొని దేశంలోపల నుండి చికిన్సునెక్

ప్రాంతాన్ని కలిపే రైలుమార్గాలు అన్నీ ఆ మేప్ మీద విపులంగా చిత్రింపబడివున్నయ్.

అందరూ ఫుల్ ఫ్లైయింగ్ డ్రస్‌లో వున్నారు. ఒంటికి అతుక్కుపోయినట్లు వున్న ముదురాకుపచ్చ ఓవరాల్స్, చేతుల్లో ఇన్నర్ హెల్మెట్లు, ఫ్లయింగ్ బోన్ డోమ్స్. ఏ క్షణాన గాలిలో లేచి శత్రు స్థావరాలమీద దాడిచేద్దామా అనే ఆతృత క్షణక్షణానికి వాళ్ళలో పెరిగి పోతోంది.

"నా. మనం చెయ్యాల్సిన పని. ఈ పంజాబు, కాశ్మీరు సరిహద్దుల్లో చికెన్స్ నెక్‌ను కలిపే ప్రతి రైలుమార్గాన్ని మనం నాశనం చెయ్యాలి. ఈ మార్గాల్లో చికెన్స్ నెక్‌లో నుండి సరిహద్దువెపు పాకిస్తాన్‌నుండి సప్లయిస్ ట్రైన్లు వస్తూ వుంటుంది. దాన్ని కనిపెట్టి భస్మీపటలం చెయ్యాలి మనం.

ఇక పోతే ఆపరేషన్. మనం పన్నెండుమంది నాలుగు మిగ్-21లు, రెండు 'నాట్'లు చొప్పున రెండు గ్రూపులుగా ఆపరేట్ చేస్తాం. మొదటిది ఫార్మేషన్ సిల్వర్ చికెన్స్ నెక్ ప్రాంతంలో వున్న ఈ రెండు రైల్వేమార్షలింగు యార్డ్‌ను కార్పెట్ బాంబింగ్ చెయ్యాలి. ఫ్లయిట్ లెఫ్టినెంట్ మార్క్స్ ఫార్మేషన్ సిల్వర్ కమాండరు.

రెండవది ఫార్మేషనే గోల్డ్. నేను లీడ్ తీసుకుంటాను గోల్డ్ ఫార్మేషన్ ఇంటీరియర్స్‌లోకి చొచ్చుకువెళ్ళి ఆ సప్లయిస్ ట్రైన్సు వెతికి నాశనం చెయ్యాలి.

ఇక టైమింగ్స్. మీ గడియారాలు సరిచేసుకోండి. అయిదు పది అయిందిప్పుడు. అయిగుం బావుకల్లా ఎయిర్ క్రాఫ్ట్ హేంగర్స్‌లో వుండాలి. అయిదు ఇరవైకి రన్ వేకి

టాక్సీఇంగ్, అయిదు ఇరవై అయిదుకి టేకాఫ్ అండ్ దెన్ గంటన్నరలోగా మన పని పూర్తి చెయ్యాలి. లేక పోతే మన జెట్స్‌లో ఫ్యూయల్ మనం తిరిగి బేస్‌కు తిరిగి రావడానికి చాలదు అని మరిచిపోకండి. నా ఫ్రెండ్స్ గుడ్ లక్ టు ఎవిరిబడి. అండ్ గుడ్ హంటింగ్"— అన్నాడు బిస్వాస్ బ్రీఫింగ్ ముగిస్తూ.

అయిదు నిముషాల్లో అందరూ ఎవరి జెట్‌లో వాళ్ళు ఎక్కి కూర్చొన్నారు. హేంగర్స్‌లో మెయింటెనెన్స్ ఇంజనీర్లు అప్పటికే ఇంజన్లు స్టార్ట్ చేసి 'వార్మప్' చేసి వుంచారు.

ఫార్మేషన్ సిల్వర్‌లోని నాలుగు మిగ్-21 జెట్ విమానాలు, వాటికి ఎస్కార్టుగా వచ్చిన టైగర్ వన్ అండ్ టు విమానాలు, భూమికి యాభై అడుగుల ఎత్తున చికిన్స్‌నెక్ ప్రాంతం వైపు బయలుదేరినయ్! అరగంట ప్రయాణం సాఫీగా జరిగింది.

సిల్వర్ వన్‌లో వున్న ఫ్లైట్ లెఫ్టినెంట్ కీలర్ మరో ఐదు నిమిషాల్లో పిసేరా రైల్వేమార్షలింగ్ యార్డ్‌కు చేర తామని మనసులోనే లెక్క వేసుకొన్నాడు మాప్ చూసుకొని.

ఆర్/టి., ఇంటర్ కమ్‌లో పిలిచాడు కీలర్. "ఫార్మే షన్ సిల్వర్ రడీ ఫర్ స్ట్రైక్. టార్గెట్‌ను మరో ఐదు నిము షాల్లో చేరబోతున్నాం."

అదే సమయంలో ఎస్కార్ట్ వస్తున్న నాట్ విమానం పైలట్లు పడమటివైపు నుండి తమవైపు దూసుకువస్తున్న శత్రు విమానాల్ని గుర్తించాడు.

"ఫార్మేషన్ సిల్వర్. గో స్ట్రెయిట్ ఎహెడ్.

డోంట్ రైజ్ హైట్." అన్నాడు ఆర్/టి లో. మిగ్ విమానాలు ముందుకు వెళ్ళిపోయాయి.

పడమటి వైపు నుండి వస్తున్న పాక్ మిరేజ్ విమానాలు నాలుగూ రెండు జట్లుగా విడిపోయాయి, ఒక జట్టు మిగ్‌ల వైపు, మరో జట్టు నాట్‌ల వైపు తిరిగాయి.

టైగర్ వన్ నాట్ పైలట్ ప్రమాదాన్ని గ్రహించాడు. ఫ్రాన్స్‌లో తయారయిన మిరేజ్ విమానాలు అతి వేగమైన, శక్తివంతమైన విమానాలు. వాటిలో వుండే ఎయిర్-టు-ఎయిర్ మిసైల్స్ చాలా ప్రమాదకరమైనవి. రెండు మిరేజ్‌లు మిగ్స్‌ను కూల్చడానికి ప్రయత్నిస్తే, మరో రెండు ఎస్కార్టు వచ్చిన నాట్‌లతో తలపడి మిగ్-21 లకు రక్షణ లేకుండా చేస్తాయన్నమాట.

"టైగర్ టు-మన వైపు వచ్చే మిరేజెస్‌ను నువ్వు కాచుకో. మిగ్‌ల వైపు వెళ్ళే వాటిపని నేను పడతాను" అన్నాడు టైగర్ వన్ నాట్‌లోని రంజిత్ సింగ్. విమానాన్ని హఠాత్తుగా ఇరవై అడుగుల ఎత్తుకు దించి ఎదురుగా వస్తోన్న మిరేజ్ మిషన్‌గన్ గుళ్ళు తప్పించుకొని మిగ్-21ల వెంటపడ్డ మిరేజ్ విమానాల వైపుకు దూసుకుపోతూ.

మిగ్-21లు ఫైటర్ జట్స్ అయినా వాటి రెక్కలకు బెల్లీ నిండా వున్న బాంబులు రాకెట్ల బరువువలన సులభంగా దిశలు మార్చే శక్తి తగ్గుతుంది. అంచేతే మిరేజ్‌లను చూడగానే బాగా క్రిందికి ఎగరమని మిగ్-21 లను హెచ్చరించాడు నాట్ పైలట్. ఆ ఎత్తులో పాక్ మిరేజ్‌లు వదిలే ఎయిర్-టు-ఎయిర్ మిసైల్స్‌కు ఉధృతంగా పనిచేసే శక్తి పోతుంది.

టైగర్ టు నాట్ విమానంలో వున్న పైలట్ మనోజ్ తనను రెండువైపులనుండి పట్టేయాలని కుడి ఎడమల నుండి వస్తోన్న మిరేజ్ లను చూడగానే, కంట్రోల్ స్టిక్ ను బాగా క్రిందికి వత్తుతూ, చటుక్కున వంద అడుగులు క్రిందకు దిగాడు.

నాట్ జట్ ఫైటర్ లో వున్న అద్భుతం - అదే కంట్రోల్స్ కు బ్యూటిఫుల్ గా రెస్పాండ్ అవుతుంది. ఎటు త్రిప్పితే అటు సులభంగా తిరుగుతుంది. క్షణాల్లో గాలిలో పల్టీలు కొడుతుంది. ఎంత తక్కువ ఎత్తుకైనా చటుక్కున దిగుతుంది. ఎంత ఎత్తుకైనా క్షణాల్లో ప్రాకి పోతుంది_ఫుల్ ఆక్సిలరేషన్ లో నిముషానికి ఇరవైమూడు వేల అడుగులు ఆకాశంలోకి ఎగబ్రాకుతుంది. అంత చిన్న జెట్ లో అంతటి శక్తి వుంది.

తన జెట్ లో వున్న శక్తిని, యుక్తుల్ని ఎలా వుపయోగించుకోవాలో మనోజ్ కు బాగా తెలుసు. రెండుప్రక్కల్నుండి ట్వెల్వ్ యమ్.యమ్. బుల్లెట్లు కాలుస్తూ తనమీదికి వచ్చే మిరేజ్ ల మధ్య నుండి ఎత్తుకు ఎగరడం అవివేకం అని తెలుసు.

కత్తెరలా వస్తోన్న క్రాస్ ఫైర్ మధ్య తన విమానం క్షణాల్లో కూలిపోతుంది. అంచేతే మిరేజ్ లనుండి తప్పించుకోడానికి భూమికి ఇరవై అడుగుల ఎత్తుకు దిగాడు. నాట్ కన్న దాదాపు మూడురెట్లు పరిమాణం వున్న మిరేజ్ లు అంత క్రిందికి రాలేవు. వస్తే నాట్ తో పాటు చురుగ్గా ఆకాశంలోకి ఎగబ్రాకే శక్తి దానికి లేదు.

క్రిందికి దిగుతూనే గుండ్రంగా తిరిగి ఓ పల్టీకొట్టే ఫుల్ యాక్సిలరేషన్ లో నాట్ ను పైకి లేపాడు. క్రిందనుండి

క్షణాల్లో రాకెట్లా రయ్యిన ఆకాశంలోకి దూసుకు వెళ్ళింది. తమ మధ్యనుండి తప్పించుకొని క్రిందకు జారిన నాట్ పై తిరిగి దాడిచేసి వుద్దేశ్యంతో మిరేజ్ లు ఫైట్ సర్కిల్ లో వెనక్కు తిరుగుతోన్నయ్.

సర్రున ఆకాశంలోకి లేస్తున్న మనోజ్ ను వెనక్కి తిరుగుతున్న ఓ మిరేజ్ అడుగుభాగం అద్భుతమైన టార్గెట్ లా కనిపించింది. ఒక్కక్షణం పైకి లేస్తున్న విమానాన్ని గాలిలో అలానే ఆపి తన ముఫై. యం.యం. ఆడెన్ కానన్ ను చకచకా పేల్చాడు. నాట్ లోని ఫిరంగి గుళ్ళు మిరేజ్ విమానం అడుగుభాగాన్ని చిల్లులు పొడిచింది. మిరేజ్ పెట్రోలు టాంకులు భగ్గున మండి క్షణాల్లో మండే అగ్నిగోళంలా ఆ మిరేజ్ కంట్రోలు తప్పి భూమ్మీదకు జారిపోవడం మొదలెట్టింది.

మిరేజ్ ను షూట్ చేయడంకోసం క్షణం ఆగిన నాట్ ను చూడగానే రెండో మిరేజ్ పైలట్ ఆలశ్యం చెయ్యలేదు. వింగ్ సైట్ సరిచేసి తిన్నగా నాట్ మీదనే ఓ ఎయిర్ టు ఎయిర్ మిసైల్ వదిలాడు.

మిసైల్ తగిలే సమయానికి నాట్ ఆ ప్రదేశం నుండి కదిలిపోయినా ఫరవాలేదు. ఆ మిసైల్ ఊహించలేని వేగంతో ఎదటి విమానం ఏవైపు తిరిగితే ఆ వైపుకు వెంటబడి కూల్చేస్తుంది. ఎయిర్ టు ఎయిర్ మిసైల్స్ లో అద్భుతం అదే.

ఓ మిరేజ్ ని కూల్చి పైకి లేస్తున్న మనోజ్ తనకు రాబోయే ప్రమాదాన్ని క్షణాల్లో గ్రహించాడు. ఎయిర్ టు ఎయిర్ మిసైల్స్ హాట్ సీకర్స్. అంటే జట్ విమానాలు ఎగిరేటప్పుడు ఎక్సాటింగ్ విషర్స్ ద్వారా వదిలే

పొగలో వుండే వేడిని బట్టి అవి, ఆ జట్ ఎటు తిరిగితే అటు తిరిగి వెంటబడి జట్ కన్నా రెట్టింపు వేగంతో వెళ్ళి జట్ ను కూల్చేస్తాయి.

వెంటనే స్పీడ్ కట్ చేసి మళ్ళీ చటుక్కున నేలవైపు విమానాన్ని దింపడం ప్రారంభించాడు. భూమికి ఏభై అడుగుల ఎత్తులో ఎయిర్ టు ఎయిర్ మిస్సైలు శక్తిహీన మవుతుందని మరిచిపోలేదు.

రయ్యిన విమానాన్ని నలభై అడుగులకు దించి, గుర్రున లెఫ్ట్ బాంక్ టర్న్ చేసి, మళ్ళీ చటుక్కున పైకి లేపాడు. భూమికి దగ్గరగా వచ్చిన మిస్సైల్ దారితప్పి భూమి ఆకర్షణశక్తివల్ల నేలవైపు దూసుకుపోయింది.

మనోజ్ నాట్ మిస్సైల్ నుండి తప్పించుకోడానికి క్రిందకు దిగడం చూడగానే మనసులోనే నవ్వుకొన్నాడు మిరేజ్ లోని పాకిస్తాన్ పైలట్. నలభై అడుగుల ఎత్తుకు వెళ్ళి మళ్ళీ చటుక్కున మనోజ్ జట్ పైకి వస్తుందని తెలుసు. అందుకే మనోజ్ నాట్ పైకి వచ్చేప్పటికి సిద్ధంగా కాచుకొని వున్నాడతను.

పైకి లేస్తోన్న నాట్ ముందుభాగమంతా మిరేజ్ వదిలిన మిషన్ గన్ గుళ్ళకు తూట్లుపడింది. పైలట్ సీటు పైభాగంలో వుండే అద్దం పగిలి ముక్కలయింది. ఇంజన్లోంచి తెల్లని పొగ క్షణాల్లో కాబిన్ నింపేసింది.

మనోజ్ నాట్ ను గాలిలోనే ఆపి చిన్న పల్టీ కొట్టించి మిరేజ్ కు ఎదురుగా తిప్పాడు. తన గురి తప్పలేదని గ్రహించిన మిరేజ్ పైలట్ మిషన్ గన్ ప్రేలుస్తూ నాట్ వైపు దూసుకువచ్చాడు.

మనోజ్ చకచకా గన్ ఫైట్ మిరేజ్ కు అడ్జస్ట్ చేశాడు. కాబిన్ గ్లాస్ రూఫ్ పగిలిపోవడంవలన గాలికి

పొగంతా బయటికి పోయింది. మిరేజ్ తనవు తిన్నగా రాగానే తన థర్టీ యమ్.యమ్. ఆడన్ కానన్ ట్రిగ్గర్ నొక్కాడు. క్షణం ఆశ్చర్యపోయాడు మనోజ్. కానన్ పనిచేయడంలేదు. బహుశా గన్ కనక్షన్ తెగిపోయి వుండాలి.

సరిగ్గా అదే సమయంలో ఇంజన్లోంచి పెద్ద పెద్ద మంటలు, నల్లటి పొగ బయటికి రావడం మొదలెట్టినయ్. విమానం క్షణక్షణానికి కంట్రోలు తప్పుతోంది. సీట్ ఏజెక్యులేటర్ స్విచ్ గట్టిగా నొక్కాడు. ఫలితం లేదు. తను ఈ కూలి పోయే విమానంలోనుండి బయటపడే అవకాశంలేదు. బలవంతంగా కంట్రోలు స్టిక్ పట్టుకొని విమానం క్రిందికి జారకుండా ఆపాడు.

మిరేజ్ పైలట్ విజయగర్వంతో పొగలు కక్కుతోన్న నాట్ కు మరింత దగ్గరయ్యాడు. అదే అతను చేసిన పొరపాటు. మనోజ్ కంట్రోల్ స్టిక్ ను గట్టిగా పట్టుకొని నాట్ ను తిన్నగా ఎదురొస్తున్న మిరేజ్ వైపే నడిపాడు. చివరి క్షణంలో మిరేజ్ పైలట్ కు మనోజ్ ఉద్దేశ్యం అర్థమయింది. చటుక్కున మిరేజ్ ను పైకి లేపాడు. కాని అప్పటికే ఆలస్యం అయింది. పొగలు కక్కుతూ మండుతోన్న టైగర్ టూ నాట్ తిన్నగా మిరేజ్ ను ఢీకొంది.

ఆకాశంలో గొప్ప ప్రేలుడు. మరుక్షణం ఒకదానితో ఒకటి కలిసిపోయిన మిరేజ్, నాట్ లు రెండూ భగభగ మండుతూ భూమివైపు జారిపోవడం మొదలెట్టాయి.

సిల్వర్ ఫార్మేషన్ మరో నిముషంలో పినేరా రైల్వే మార్షలింగ్ యార్డ్ చేరుకొంటుంది. ఈలోగా

సిల్వర్ మిగ్స్‌ను వెంటాడుతున్న మిరేజ్‌లు వాటిని కూల్చకుండా ఆపడమే టైగర్ వన్ నాట్‌లో రంజిత్ సింగ్ లక్ష్యం.

ఎందుకంటే సిల్వర్ ఫార్మేషన్ రైల్వే యార్డ్ చేరగానే చకచకా బాంబింగ్ పూర్తిచేసి తన సహాయానికి వస్తాయని తెలుసు. ఎందుకంటే సిల్వర్ మిగ్స్ ఏదో ఒక ప్రత్యేక టార్గెట్ బాంబ్ చేసే పనిమీద రాలేదు. మార్షలింగ్ యార్డు కార్పెట్ బాంబింగ్ చెయ్యడానికి వచ్చాయి.

కార్పెట్ బాంబింగ్ అంటే, శత్రువుకు పనికొచ్చే ప్రతి వస్తువుమీదా విచక్షణారహితంగా వరుసగా చాప పరిచినట్లు బాంబులు వదులుకొంటూ పోవడమే. అందుచేత సిల్వర్ ఫార్మేషన్‌లో వుండే మిగ్ జాగ్రత్తగా ఒక్కో బాంబే జారవిడవాలన్న నియమం ఏమీలేదు. రైల్వే యార్డులోని రైలు బద్దీలు, యార్డులో వున్న గూడ్సు రైళ్లు, గొడౌన్లు, పెట్రోలు డంప్‌లు, అన్నిటిమీదా వరుసగా బాంబులు వేసుకొంటూ పోతారు.

స్పీడు పెంచి తన నాట్‌ని మిరేజ్‌లవైపు ఉరికించాడు రంజిత్ సింగ్.

మిరేజ్‌లు మాత్రం ట్రీటాప్ లెవల్లో ఎగురుతోన్న మిగ్‌లంత క్రిందికి ఎగిరి షూట్ చేయడం కష్టం కనుక వాటి ప్రక్కల, పైనా అదనుకోసం కాచుకొని తరుముతున్నాయి. పైగా మిరేజ్‌లకు మిగ్‌లతో మరో సమస్య వుంది. మిరేజ్‌లు గంటకు దాదాపు పదిహేనువందల మైళ్ళ వేగంతో పోతాయి. వాటితో పోలిస్తే మెల్లగా వెళ్ళే మిగ్‌లతో సరయిన స్పీడు మెయిన్‌టైన్ చెయ్యడం

మిరేజ్ పైలట్లకు కష్టమవుతుంది. మిరేజ్ లలో వుండే ఈ డిఫెక్ట్ తెలిసిన మిగ్ పైలట్లు సాధ్యమైనంత తక్కువ వేగంతో మిగ్ లు నడుపుతున్నారు.

ఆలస్యం చెయ్యకుండా మిగ్ లతో సమానమైన ఎత్తులో వేగంగా తన నాట్ విమానాన్ని ముందుకు దూకించాడు రంజిత్. క్షణాల్లో మిరేజ్ ల క్రిందకు తీసుకు వచ్చాడు తన నాట్ ని.

తమ క్రిందకే వచ్చిన నాట్ ను చూడగానే గబగబా తమ మిరేజ్ లను ఎత్తుకు లేపసాగారు మిరేజ్ పైలట్లు. రంజిత్ సందేహించలేదు. నాట్ ని పల్టీకొట్టించి, బొంగరంలా గిర్రున తిప్పుతూ నిటారుగా పైకి లేపాడు.

వేగంగా పైపైకి పోతున్న మిరేజ్ తోకభాగం స్పష్టంగా కనిపించింది. దాదాపు ఆరొందల గజాల దూరంలో వుంది. గన్ ఫైట్ క్షణంలో అడ్జస్ట్ చేసి చకచక తన కానన్ పేల్చాడు. గురి తప్పలేదు. ఎదురుగా వున్న మిరేజ్ తోకలోనుండి మరుక్షణం నల్లటి పొగ రాసాగింది. మిరేజ్ బట్స్ వెనకవైపు 'ఆఫ్టర్ బర్నర్స్' క్రిందుగా ఎక్స్ట్రా ఫ్యూయల్ టాంక్స్ వుంటాయి. బహుశా అవి పగిలి, ఆఫ్టర్ బర్నర్ వేడికి అంటుకొని వుంటాయి. ఆ విమానం ఇక ఎంతోసేపు ఆకాశంలో ఎగరదు.

గిర్రున గడియారం ముల్లులా ఆకాశంలో ఓసారి తిరిగి రెండో మిరేజ్ కోసం చూశాడు. నవ్వాగలేదు రంజిత్ కు. క్షణక్షణానికీ వేగం పెంచుకొంటూ దూరంగా వెళ్ళి పోతోంది ఆ రెండో మిరేజ్.

'పారిపోతున్నాడు బాస్టర్డ్.' అనుకొన్నాడు గట్టిగా నవ్వుకొంటూ.

రంజిత్ ముఖంమీద నవ్వు క్షణంలో జారిపోయింది. ఏదో బలమైన హస్తం పట్టుకొని ఊపినట్లు నాట్ అటూ ఇటూ ఊగుతోంది. అప్పుడు తెలిసింది రంజిత్‌కు తన పొరపాటు. తోక అంటుకొని మండిపోతోన్న ఆ మిరేజ్ పైలట్ ఎలాగో కంట్రోల్ చేసుకొని తన మీదకు ఎయిర్-టు-ఎయిర్ మిస్సైల్ ప్రయోగించాడని. ప్రయోజనం లేదని తెలుసు; ఇంకా మిగ్‌ని రక్షించాలని ప్రయత్నించడంవలన ఏ క్షణాన్నయినా మిగ్ పేలిపోవచ్చు.

సీట్ ఎజెక్ట్యులేటర్ బటన్ బలంగా నొక్కాడు. చటుక్కున తను కూర్చున్న సీటుతోసహా స్ప్రింగ్‌లా విమానంలోనుండి ఆకాశంలోకి విసిరేయబడ్డాడు. మరు క్షణం మిగ్-21 పెద్ద శబ్దంతో ఆకాశంలో తునాతునకలయింది.

ఎజెక్ట్యులేటర్ సాయంతో బయటపడిన రంజిత్‌సింగ్ తన పారాచూట్‌ను రిలీజ్ చేశాడు. మెలిమెల్లిగా గాలిలో తేలుతూ క్రిందకు దిగసాగాడు.

## 6

ఉదయం: ఆరు పదిహేను.

"ఫార్మేషన్ గోల్డ్."

ఫార్మేషన్ గోల్డ్‌లోని నాలుగు మిగ్-21 జెట్ బాంబర్లు, ఎస్కార్ట్స్‌గా వెళుతున్న టైగర్ త్రీ అండ్ ఫోర్ నాట్ జెట్ ఫైటర్స్, స్క్వాడ్రన్ లీడర్ బిస్వాస్ నాయకత్వంలో పాకిస్తాన్ రాడార్లకు అందకుండా ట్రీటాప్ లెవెల్లో పాకిస్తాన్ భూభాగంలో చొచ్చుకు పోసాగాయి.

క్షణక్షణానికీ విలువైన కాలం వృధా అయిపోతుందని తెలుసు బిస్వాస్‌కి. అంబాలా బేస్ వదిలి అప్పటికే

ముప్పావుగంట దాటింది. అప్పటినుండి పాకిస్తాన్ ఫార్వర్డ్ ట్రూప్స్‌కి సప్లయిస్ తీసుకువెళ్ళే ఆ ట్రైన్ కోసం చికెన్స్ నెక్ ప్రాంతంనుండి సియాల్ కోట్ వరకూ అల్లిబిల్లిగా అల్లుకుపోయిన రైలుమార్గాలన్నీ క్షుణ్ణంగా వెతికారు. అదృష్టం కలిసిరాలేదు. మరో పావుగంటలో ఆ ట్రైను ఎటు వస్తుందో కనుక్కోలేకపోతే తమ ప్రయత్నం విఫలమయినట్లే. ఎందుకంటే ఆ తర్వాత ఇంకా వెతుకుతూ వుంటే బేస్‌కు తిరిగి వెళ్ళడానికి జెట్స్‌లో మిగిలే పెట్రోలు సరిపోదు.

అప్పుడు గుర్తొచ్చింది బిస్వాస్‌కు. సియాల్ కోట్ నుండి చికెన్స్ నెక్ వైపు వెళ్ళే రైలుమార్గం ఓటి. ఆ రైలు మార్గాన్ని చాలా కాలంనుండి వాడడం మానేయడం వలన ఏ మేప్‌లోనూ గుర్తించలేదు. ఆ రైలు మార్గం గురించి గత యుద్ధంలో పాల్గొన్న తన సీనియర్స్ క్లబ్‌లో మాట్లాడుతుండగా విన్నాడు ఓసారి.

చికెన్స్ నెక్‌లో కాశ్మీరు బోర్డరుకు దగ్గరగా వెళుతుంది ఆ రైలు మార్గం. ఆఖరి ప్రయత్నంగా ఆ రైలు మార్గాన్ని వెతకాలని నిశ్చయించుకొన్నాడు బిస్వాస్. వెంటనే విమానాన్ని ఆ వైపు తిరగమని హెచ్చరించాడు.

ఆరు ఇరవై అయిదుకు మేప్‌లో గుర్తింపబడని ఆ రైలు మార్గం బిస్వాస్ కంటబడింది. ఆ రైలు మార్గం వెంటే నిముషానికి ఎనిమిది మైళ్ళ వేగంతో జెట్‌ను పోనివ్వసాగాడు. కనుచూపుమేర దూరంలో ఎక్కడా రైలనేది లేదు.

ఆరున్నరయింది. ఇక బేస్‌కు తిరగమని ఆర్/టిలో చెప్పబోయి ఆగిపోయాడు బిస్వాస్. దూరాన నల్లని రైలు

పొగ కనిపిస్తోంది. క్షణాల్లో దాదాపు ఏభై వాగన్ల పొడ వున్న రైలు బిస్వాస్ కళ్ళబడింది.

"ఫార్మేషన్ గోల్డ్...టార్గెట్ ఎహెడ్...ఎక్నాలెడ్జ్." అన్నాడు ఇంటర్‌కమ్‌లో ఉత్సాహంగా.

మిగిలిన పైలట్లందరూ ఒకరి తర్వాత ఒకరు రైలును చూసినట్లు రిప్లయ్ ఇచ్చారు.

"ఓ.కె. లాడ్స్. క్లయింబ్ టు థవుజండ్. రైలు దాటి ముందుకు వెళ్ళండి. ముందువైపునుండి ఎటాక్ చేద్దాము." అన్నాడు బిస్వాస్.

మిగ్‌లన్నీ చకచకా ఎత్తుకు ఎగబ్రాకడం మొదలెట్టినయ్.

"టైగర్స్ డైవ్ లో అండ్ స్కాట్" రెండు నాట్‌లకూ ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చాడు బిస్వాస్.

మిగ్‌లు నాలుగూ ఎత్తుకెళ్ళి రైలుమీద దాడికి సిద్ధపడే సమయంలో నాట్‌లో పైలట్లు ఇద్దరూ క్రిందగా ఎగురుతూ తమకు కావలసిన ట్రైను అదో కాదోనని గుర్తిస్తారు. అదే సమయంలో ట్రైనుమీద ఎక్కడయినా యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ గన్లు వున్నయ్యేమో గుర్తించి బాంబింగ్ టీమును హెచ్చరిస్తారు.

టైగర్ త్రీ అతి వేగంతో రైలు వాగన్లను తగులుతున్నట్లు ఎగురుతూ వెళ్ళిన విమానం శబ్దం వింటూనే అసంకల్పితంగానే డ్రైవరు కూత వేశాడు.

టైగర్ ఫోర్ పల్టీలు కొడుతూ పక్షిలా నాట్‌ను ఓసారి ట్రైనుమీదకు దింపి పైకెగిరాడు.

"మై గాడ్! ఫుల్ ఆఫ్ యాంటీస్." అన్నాడు టైగర్ ఫోర్ పైలట్ రాంజీ.

"అవును. ప్రతి వాగన్ మీదా ఓ యాంటీ ఎయిర్ క్రాఫ్ట్ గన్ వున్నట్టుంది" అన్నాడు టైగర్ త్రీ వినయ్ విమానాన్ని ఇంకా ఎత్తుకి తీసుకెళుతూ.

విజయ్ మాటలకు సమాధానంలా దాదాపు ఓ పది యాంటీ ఎయిర్ క్రాఫ్ట్ గన్స్ ఆకాశంలోకి షెల్స్ వదలడం ప్రారంభించినయ్.

"ఫార్మేషన్ గోల్డ్... టైగర్ త్రీ రిపోర్టింగ్... మోర్ దెన్ ట్వంటీ యాంటీస్. కేర్ ఫుల్ అండ్ గుడ్ లక్." అన్నాడు వినయ్ బిస్వాస్ కు రిపోర్టు చేస్తూ.

టైనుమీదే రెండు వేల అడుగుల ఎత్తున ఆరు విమానాలు గుండ్రంగా తిరుగుతున్నాయి. ఆ ఎత్తులో యాంటి ఎయిర్ క్రాఫ్ట్ గన్స్ వల్ల భయమేమీ లేదు. కాని క్రిందకు దిగి వేగంగా కదిలే ఆ ట్రైనుమీద దాదాపు ఇరవై ఎ.ఎ.సి. గన్లు షెల్స్ వెదజల్లుతోంటే బాంబింగ్ చెయ్యాలని ప్రయత్నించడం అవివేకం.

"లెటజ్ మేక్ బీ హైవ్ డ్రాప్." అన్నాడు బిస్వాస్ ఓ నిర్ణయానికొచ్చి.

బీ హైవ్ డ్రాప్ అంటే, బాంబ్ చేయదలచుకొన్న వస్తువుమీద చాలా ఎత్తునుండి రెండు విమానాలు కలిసి ఒకే వరసలా బాంబుల్ని జారవిడవడం.

రెండు మిగ్ లు ఎ.ఎ.సి. గన్లకు అందని ఎత్తులోనుండి బీ హైవ్ డ్రాప్ చేశాయి. నాలుగు వందల కిలోల బాంబులు ఈలధ్వని చేసుకొంటూ క్రిందకు జారాయి. తన విమానంలోనుండి ఆత్రుతగా చూస్తున్నాడు బిస్వాస్.

నాలుగు బాంబులూ రైలుపట్టాలకు చాలా దూరంగా, దాదాపు వంద గజాల దూరంలో నేలను తాకాయి. నాలుగుచోట్ల దుమ్ము కెరటంలా పైకి లేచింది.

"నో యూజ్. క్రిందికి వెళ్ళి ప్రయత్నించాల్సిందే. రైలు ట్రాక్‌ని ముందుకు వెళ్ళి బాంబ్ చేసినా ప్రయోజనం లేదు. బోర్డర్‌కు చాలా దగ్గరగా వచ్చేసింది రైలు. ఇక్కడ ఆగిపోయినా వాళ్ళకేమీ నష్టంలేదు. కాకపోతే ఓ అరగంట లేటవుతాయి సప్లయిలు. రైలును ధ్వంసం చెయ్యడం తప్ప మరో మార్గం లేదు" అన్నాడు బిస్వాస్.

"షల్ ఐ గో లీడర్." అడిగాడు గోల్డ్ టు పైలట్.

"నో. థాంక్యూ. ఐ విల్ గో ఫస్ట్. యూ ఫాలో మీ." అన్నాడు బిస్వాస్ విమానాన్ని క్రిందకు బాంబ్ చెయ్యడానికి రడీగా దింపుతూ.

స్క్వాడ్రన్ కమాండర్ తను వెనక్కి వుండి తన జూనియర్స్‌ని ప్రమాదంలోకి ముందు పంపడం మంచి నాయకుడి లక్షణం కాదు. అందుకే ముందు బిస్వాస్ తన విమానాన్ని పోనిచ్చాడు.

"మొదట రాకెట్లు రిలీజ్ చేసి ట్రైను ముందున్న మార్గం ధ్వంసం చెయ్యండి. అప్పుడు ట్రైనును బాంబ్ చెయ్యడం తేలికవుతుంది." అన్నాడు బిస్వాస్.

మిగ్‌లు క్రిందికి వచ్చేకొలదీ వానజల్లులా యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ షెల్స్ కాలుస్తున్నారు క్రిందనుండి. వంద అడుగుల ఎత్తుకు రాగానే రైలుకు సమాంతరంగా తిప్పాడు విమానాన్ని బిస్వాస్. కంట్రోలు స్టిక్‌ను ఓ చేత్తో వెనక్కి నెట్టిపట్టి, రెండవ చేత్తో రాకెట్ లాంచరు మీట నొక్కాడు. మిగ్-21 రెక్కలక్రింద అమర్చిన పన్నెండంగుళాల రాకెట్లు రెండు శరవేగంతో ట్రైనుమీదకు దూకాయి...

వదిలిన నాలుగు రాకెట్లలో ఒక్కటే వాగన్ మీద పడింది మిగిలిన మూడూ ప్రక్కలకుపడి ప్రేలిపోయాయి. ఒక యాంటీక్రాఫ్ట్ బుల్లెట్ కాబిన్ నేలలోంచి పైకొచ్చి బిస్వాస్ తొడలోంచి బయటికొచ్చి కప్పులోనుండి వెళ్ళి పోయింది. ఓవరాల్ క్రింద రక్తం జివ్వున చిమ్మింది. పళ్ళు బిగువున విమానాన్ని పైకి లేపి దూరంగా తీసుకెళ్ళాడు.

గోల్డ్ టు పరిస్థితి మరీ ఘోరంగా తయారయింది. రాకెట్ వదలడానికి ట్రైనును అప్రోచ్ అవుతుండగానే పాక్ బుల్లెట్లు మిగ్-21ను తూట్లు పొడిచాయి పెట్రోలు టాంకులు అంటుకొని ఆకాశంలోనే భగ్గున మండి పేలిపోయింది.

బిస్వాస్ ముఖం బాధతోనూ, కోపంతోనూ బిగుసుకొంది. "ఫార్మేషన్ స్టాప్ స్ట్రైక్. పులవ్." అరిచాడు ఆర్/టి. లో.

వానజల్లులా కురుస్తోన్న ఆ బుల్లెట్లమధ్య నుండి క్రింద కెళ్ళి బాంబ్ చెయ్యడం బుద్ధిహీనత. తన మొండితనం వలన, తప్పునిర్ణయం వలన ఇప్పటికే ఓ ప్రాణం పోయింది. అందుకే గోల్డ్ త్రీ, ఫోర్ లను బాంబ్ చెయ్యకుండా పైకి పిల్చాడు.

"లీడర్! గివజ్ ఎ చాన్స్. బాంబుల బరువు లేకుండా మేము సులువుగా ఆ బుల్లెట్ల మధ్య తిరగ్గలము" అన్నాడు నాట్ లోవున్న విజయ్.

"ఒ.కె. టైగర్ త్రీ! బి కేర్ ఫుల్"—అన్నాడు బిస్వాస్ నిస్సహాయంగా.

విజయ్ తన నాట్ ని పూర్తి యాక్సిలరేషన్ లో పది వేల అడుగుల ఎత్తుకు తీసుకెళ్ళాడు. అక్కడినుంచి

పారెలల్ డ్రాప్‌లో అతివేగంగా క్రిందకు జారాడు. ఆకాశంలోనుండి తిన్నగా అతివేగంగా వచ్చే నాట్‌ను గురిచూడ్డం కష్టం.

పైనించి క్రిందకు దిగుతునే తన థర్టి యమ్. యమ్. కానన్‌ను చకచకా పేల్చాడు. ఇంకా రైలు ముప్పై అడుగుల్లో వుందనగా రైట్ బాంకు త్రిప్పి మళ్ళీ వేగంగా ఫుల్ యాక్సిలరేషన్‌లో పైకి వెళ్ళిపోయాడు.

రెండు యాంటీఎయిర్‌క్రాఫ్ట్ గన్లు, వాటిని పేల్చే సైనికులు ముక్కలయి రైలు మీదనుండి క్రిందకు పడ్డారు.

"వెల్ డన్. టైగర్ త్రీ!"_అరిచాడు బిస్వాస్ ఉత్సాహంగా.

టైగర్ ఫోర్ నాట్‌లోని రాంజీ కూడా విజయ్‌లానే ఎత్తుకువెళ్ళి సర్రున క్రిందికి జారాడు కానన్ పేలుస్తూ. కాని ఈసారి పాక్ సైనికులు సిద్ధంగా వున్నారు.యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ బుల్లెట్‌లు క్రిందకు దిగి పైకి లేవబోతున్న నాట్‌నిండా జల్లెడలా చిల్లులు పొడిచాయి.

"టైగర్ ఫోర్...పులప్...పులప్" అరుస్తున్నాడు బిస్వాస్.

"రాంజీ.యూ. డామిట్. పులప్"__అరుస్తోన్నాడు విజయ్.

కాని రాంజీ వీరెవరి మాటలు వినే స్థితిలోలేదు. బుల్లెట్ ఒకటి అతని పొట్టలో నుండి దూసుకుపోయి, రక్తం వరదలుగా కారసాగింది. ఇంజన్ అంటుకొని భగ భగ మండుతోంది. జెట్ రెండు రెక్కలూ చిల్లులు పడి

తడికెలా తయారయి క్షణక్షణానికీ కంట్రోలు తగ్గి పోతుంది.

"గుడ్ బై ఫ్రండ్స్!"_అరిచాడు రాంజీ బాధగా తన నాట్‌ను ట్రైనువైపు ఉరికిస్తూ.

"రాంజీ. పులప్."—అరుస్తోన్నాడు బిసాస్వ.

టైగర్ ఫోర్ నాట్ విమానం రాలిన ఆకులా వణుకుతూ ట్రైను వైపుకు కదిలింది. మరిన్ని యాంటిక్రాఫ్ట్ బుల్లెట్లు ఇంజన్లో దిగాయి. రాంజీ కళ్లు మూసుకొని ఓ సారి ఇష్టదైవాన్ని తలుచుకొన్నాడు. "భారత మాతాకీ జై" అంటూ అరిచాడు. నాట్ విమానం పల్టీలుకొడుతూ ట్రయినుమధ్యలో వున్న పెట్రోలు టాంకర్ల మీద కూలింది.

భగ్గున మంటలు ఆకాశం ఎత్తు లేచాయి. పెద్ద పెద్ద శబ్దాల్లో, మంటలలో, నల్లని పొగల్లో, దాని ప్రక్కన వున్న టాంకర్లు అంటుకొన్నాయి. ట్రైను పట్టాలు తప్పింది. ట్రైను పైన యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ గన్స్ దగ్గరవున్న సైనికులు సర్రున క్రిందకు జారారు. కొందరు ప్రాలన్సు తప్పి కూలబడ్డారు.

"గాడ్ బ్లెస్ హిమ్. లెటజ్ బ్లాస్ట్." అన్నాడు బిస్వాస్ విమానాన్ని కిందికి దూకిస్తూ.

మరుక్షణం నాలుగు మిగ్‌లు సప్లయి ట్రయిన్ మీద బాంబులవర్షం కురిపించాయి. నిముషాలమీద సప్లయి ట్రైను మండుతున్న ఇనుపముక్కల కొలిమి అయింది.

బాంబింగ్ పూర్తి చేసి విజయగర్వంతో పైకి లేచాయి భారత మిగ్-21 విమానాలు. ఈ సప్లయ్ ట్రైను లేకుండా పాకిస్తానీయులు యుద్ధం చెయ్యలేరని తెలుసు. అంటే

భారత సేనలకు మరోసారి విజయం తథ్యం అనే తెలుసు.

"గాడ్ మిట్... ఐదుకింక అయిదు నిముషాలుంది. హారియప్...త్వరగా బోర్డర్ వైపు పదండి" అరిచాడు బిశ్వాస్ ఆర్/టిలో...

"బట్ లీడర్! మనం ఈ పెట్రోల్ లో బేస్ వరకూ వెళ్ళలేం" అరిచాడు వినయ్.

"డోంట్ వర్రీ...బోర్డర్ ఎంతో దూరంలేదు. మన భూభాగంలోకి వెళ్ళగానే బెయిలవుట్ అయిపోదాం... బయటికి దూకగానే పారాచూట్లు చిక్కుపడకుండా విప్పుకోవాలని దేవుణ్ణి ప్రార్థించుకోండి" అన్నాడు బిస్వాస్ మరో ముప్ఫై మైళ్ళలోవున్న భారత భూమివైపు మిగ్-21ను వురికిస్తూ.

—: ఐపోయింది :—